# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com


అనంతపురము | సంపుటి:02 | సంచిక:203 | శనివారం | ఏప్రిల్ 05, 2025 | ఎడిటర్: కె.పురుషోత్తమకుమార్ | పేజీలు :8 | వెల:రూ 5/-

published from Ananthapuramu, Eluru, Kadapa, Kakinada, Vijayawada, Circulated at AndhraPradesh & Telangana


లోపలి పేజీలో



పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పండుగ



## సచివాలయంలో అగ్నిప్రమాద ప్రదేశాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్నిప్రమాద ప్రదేశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంమంత్రి అనిత, జీఏడీ పొలిటికల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందని, ఏ సమయంలో చోటు చేసుకుందని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రతిచోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్ బృందం ఎన్ని గంటలకు వచ్చిందని అడిగారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అవసరమైన ఆధారాలను సేకరించిందీ లేనిది అడిగారు. సచివాలయంలో అన్ని చోట్లా భద్రతా ప్రమాణాలన్నీ పాటిస్తున్నారా లేదా అన్నది ఆడిట్ చేయాలని సూచించారు.

మిగతా 2లో

## బర్డ్ ఫ్లూపై ఆందోళన అవసరం లేదు

-బాలిక మృతి ఘటనపై ఐసీఎంఆర్ బృందం అధ్యయనం

-వ్యాధి నిరోధక శక్తి లేకపోవడం, అపరిశుభ్ర వాతావరణం, లెప్టోస్పిరోసిస్ కూడా కారణమని నిర్ధారణ

-ఐసీఎంఆర్ బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

2




# ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి

-అవసరాన్ని బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వర్చువల్ వైద్యసేవలు

-వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల నుంచి 300 పడకల సామర్థ్యంతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు స్థాపించేలా కార్యాచరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మొత్తం 175 నియోజకవర్గాలకు గాను 100 పడకలకు పైగా సామర్థ్యం ఉన్న ఆస్పత్రులు ఇప్పటికే 70 వరకు ఉన్నాయని, మిగిలిన 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ నిర్మాణం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నిర్మించి, నిర్వహించేలా ఆలోచన చేయాలని, ఇందుకోసం ముందు కొచ్చే సంస్థలకు పరిశ్రమల తరహాలోనే సబ్సిడీలు ఇచ్చే విధానం రూపొందించాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... రాష్ట్రంలో వైద్యసేవల్ని మరింత విస్తృత పరచాలని చెప్పారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ వైద్యం కోసం అమరావతి వచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని చెప్పారు.

వర్చువల్ వైద్య సేవలు : విద్య-వైద్య రంగాలు తమ ప్రాధామ్యాలుగా చెప్పిన ముఖ్యమంత్రి...గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులకు చెప్పారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ స్థాయిలో వైద్యులు అందుబాటులో లేని సమయంలో రోగులకు వర్చువల్ విధానంలో ప్రాథమిక సేవలు అందేలా చూడాలన్నారు. అన్యారోగ్యం బారిన పడిన తర్వాత వైద్యసేవలు అందించే పరిస్థితి నుంచి... ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్, దయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి చాలావరకు బయటపడవచ్చన్నారు.

మిగతా 2లో

## సచివాలయంలో అగ్నిప్రమాదంపై విచారణ చేస్తాం

- షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమిక నిర్ధారణ

-ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తగు చర్యలు : హోంమంత్రి అనిత



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: సచివాలయంలోని రెండో బ్లాక్ లో జరిగిన అగ్నిప్రమాదం ఘటనపై విచారణకు ఆదేశించామని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని ఆమె పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం 6. 30 గంటల సమయంలో రెండో బ్లాక్ లోని బ్యాటరీల నుంచి పొగలు రావడాన్ని ఎస్పీఎఫ్ సిబ్బంది గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారన్నారు.

మిగతా 2లో




## డబ్బుకోసం గడ్డి తినం... ఇక 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

-గంటల కొద్ది వేచి ఉండాల్సిన అవసరం లేదు

-స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్

-ప్రస్తుతం 26 జిల్లా కేంద్రాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభం

-296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా అమలు

-నాలా బకాయిలన్నీ వన్ టైమ్ సెటిల్మెంట్

2

2



## 74 వేల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం కొనుగోలు

-రూ.154 కోట్లు రైతులు చెల్లించాం

-24 గంటల్లోనే రైతుల ఖాతాలకు డబ్బులు జమ

-రైతు నుండి ప్రతి బస్తా కొనుగోలు చేయడం జరుగుతుంది

-రైతుల సంతోషమే కూటమి ప్రభుత్వము ముఖ్య ఉద్దేశ్యం

-రైతులకు గిట్టుబాటు ధర కల్పించాం

-రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

## ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్యపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

రాజమహేంద్ర వరంలో ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి బలవన్మరణం దురదృష్టకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిపై చట్టపరంగా



చర్యలు ఉంటాయని తెలిపారు. విద్యార్థిని సూసైడ్ నోట్ ప్రకారం ఇప్పటికే ఆసుపత్రి ఏజీఎం దీపక్‌ను పోలీసులు అరెస్టు చేశారని పవన్ చెప్పారు. రాష్ట్రంలోని విద్యార్థినులు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థిని నాగాంజలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

2



## మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు విధాన పత్రం రూపొందించండి

-జీవన నైపుణ్యాలు పెంపొందించే దిశగా విద్యా విధానం ఉండాలి..

-భాష.. విషయ పరిజ్ఞానం రెండూ ప్రధానమే...

-విద్యా కమిషన్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



## ఏప్రిల్ 5న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- ఏప్రిల్ 6న ధ్వజారోహణం



లోపలి పేజీలో

ప్రజాభూమి

## ఏపీ హైకోర్టులో టీటీడీకి రిలీఫ్

-తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా ఉన్న శ్రీనివాస దీక్షితులు

-తనను తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడిగా బదిలీ చేయాలంటూ హైకోర్టులో పిటిషన్

-టీటీడీ పాలనాపరమైన అంశాల్లో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ ప్రధాన అర్చక పదవి నుంచి తనను తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడిగా బదిలీ చేయాలంటూ పెద్దింటి కుటుంబానికి చెందిన శ్రీనివాస దీక్షితులు వేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది.

శ్రీనివాస దీక్షితులు పిటిషన్ పై ఈరోజు విచారణ జరిపిన హైకోర్టు... టీటీడీ పాలనాపరమైన అంశాల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. టీటీడీ ఎక్కడ విధులు కేటాయిస్తే అక్కడ ఉద్యోగిగా విధులు నిర్వహించాలని శ్రీనివాస దీక్షితులుకు ఆదేశాలు జారీ చేసింది.



## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి పత్రం

ప్రజాభూమి పలాస:

ఆటో ఫిట్నెస్ పరీక్షలు చేయించేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఈ సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కు విజ్ఞప్తి చేశారు ఆటో యూనియన్ల గౌరవ అధ్యక్షుడు టిడిపి నాయకుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులంతా ఎమ్మెల్యే శిరీషను ఆమె కార్యాలయంలో గురువారం కలిశారు ప్రస్తుతం ఆటో ఫిట్నెస్ పరీక్షలు చేయించాలంటే ఎచ్చెర్ల వెళ్లాల్సి వస్తుందని ఈ నేపథ్యంలో రానుపోను రెండు వందల కిలోమీటర్లు జాతీయ రహదారిపై ఆటో ప్రయాణం చేయాల్సి వస్తుందని అనివార్య కారణాలతో పరీక్ష వాయిదా పడితే ఇబ్బందులు అధికంగా ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు గతంలో పలాసలో ఈ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించే వారిని ఇక్కడ ఆ సేవలను ఎత్తివేయడంతో జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి హాజరవ్వాల్సి వస్తుందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# డబ్బుకోసం గడ్డి తినం... ఇక 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ సేవలను శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రారంభించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ హరి నారాయణ, అడిషనల్ ఐజీ ఉదయ భాస్కర్, జాయింట్ ఐజీలు రవికుమార్, సరోజలతో కలిసి స్లాట్ బుకింగ్ అవగాహన కరప్రతాన్ని, పోస్టర్ ను మంత్రి సత్యప్రసాద్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సులభతరంగా సేవలు అందించాలనే సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్ అధికారిక వెబ్ సైట్ లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏ రోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి కొచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాక్ష్యులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తమకు కుదిరిన సమయాల్లో వచ్చి పని పూర్తి చేసుకోవచ్చన్నారు. స్లాట్ ఆధారిత అపాయింట్మెంట్లు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గిస్తాయన్నారు. ఈరోజున మొత్తం 26 జిల్లా ప్రధాన కార్యాలయాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని, మొత్తం 296 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ స్లాట్ బుకింగ్ సిస్టమ్ దశలవారీగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికే గాంధీనగర్, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తోందని తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం ద్వారా అన్లైన్ లో డేటా ఎంట్రీ చేసి డాక్యుమెంట్ ప్రీపేర్ చేసుకొని ఫీజు కూడా కట్టేసి ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చిన 10 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తయిపోతుందన్నారు. ఒక వేళ స్లాట్ బుకింగ్ చేసుకోలేకపోయిన వారు సబ్ రిజిస్టార్ ఆఫీసుకు వస్తే సాయంత్రం ఐదు గంటల తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా రూ. ఐదు వేల రూపాయల ప్రత్యేక ఫీజు తీసుకొని రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పారు. ఉగాది,రంజాన్ పండుగల సందర్భంగా వరుసగా వచ్చిన మూడు రోజుల సెలవుల్లో దాదాపు రూ.74 కోట్ల రూపాయల రిజిస్ట్రేషన్ ఆదాయం లభించిందన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమ్యూటేషన్ను సులభతరం చేయడం కోసం రిజిస్ట్రేషన్ సాఫ్ట్ వేర్ ను రెవెన్యూ డేటాబేస్ తో అనుసంధానం చేశామన్నారు. మున్సిపల్ వంటి ఇతర శాఖలతోనూ అనుసంధానం ప్రారంభించామని, ఈ ప్రక్రియ 2025 ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తవుతుందని తెలిపారు. ఈ అనుసంధానంతో ఆస్తిపై యాజమాన్యం ఉన్న వ్యక్తి మాత్రమే రిజిస్ట్రేషన్ చేయగలుగుతారని చెప్పారు. డబుల్ రిజిస్ట్రేషన్ , నకిలీ డాక్యుమెంట్ల సృష్టి లాంటి రియల్ ఎస్టేట్ మోసాలను నివారించేందుకు శాఖ అనేక చర్యలు తీసుకుందన్నారు. ఆధార్ సేవలను రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. డాక్యుమెంట్లను సమర్పించినప్పుడు పార్టీల డిజిటల్ సంతకాలు కూడా తీసుకోబడతాయని, ఈ విధంగా ఆధార్ ఆధారంగా రిజిస్ట్రేషన్ లో ఆధారిత గుర్తింపును ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ నుండి ప్రశంసలు అందుకున్నామని చెప్పారు. పేద ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో రెవెన్యూ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న, భూ యజమానులకు ఇబ్బందిగా ఉన్న నాలా యాక్ట్ ను రద్దు చేస్తున్నామన్నారు.

నాలా యాక్ట్ కు సంబంధించి ఇప్పటి వరకు ఏవైనా బకాయిలు, అపరాధ రుసుములు ఉంటే వన్ టైమ్ సెటిల్మెంట్ చేస్తామన్నారు. 2024-25 ఏడాదికి రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గిందని అవినీతి పత్రిక సాక్షి వార్తలు రాసిందని, అయితే డబ్బు కోసం గడ్డితినే ప్రభుత్వం మాది కాదని అన్నారు. పేదల అభ్యున్నతి తోపాటు, అభివృద్ధిని కూడా సాధిస్తూ ఆదాయాన్ని పెంచుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం భూ అరచాకాలు చేసిందని, ఫ్రీ హోల్డ్ పేరుతో పెద్ద కుంభకోణానికి పాల్పడిందని విమర్శించారు. రెవెన్యూ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఆర్ పి సిసోదియా మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల శాఖలో వరుసగా తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా అవినీతి తగ్గిపోయి పారదర్శకత పెరుగుతుందన్నారు

. రానున్న రోజుల్లో ఫేస్ లెస్, పేపర్ లెస్, క్యాష్ లెస్ గా రిజిస్ట్రేషన్లు జరపాలనేది తమ లక్ష్యమని చెప్పారు. స్లాట్ బుకింగ్ విధానం ఇలా:రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వెబ్ సైట్ registration.ap.gov.in లోని పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా డేటా అంతా ఎంట్రీ చేసి అప్లికేషన్ నెంబర్ ను పొందాలి. ఆ తర్వాత స్లాట్ బుకింగ్ మాడ్యూల్ లో అప్లికేషన్ నెంబర్ ను ఎంటర్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆరోజు నుండి 15 రోజుల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ 15 రోజుల్లో ఖాళీగా ఉన్న స్లాట్ ను డైనమిక్ గా వైబ్ సైట్ ఎప్పుడూ చూపిస్తూ ఉంటుందని మంత్రి అనగాని అన్నారు

# ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి

మొదటిపేజీ తరువాయి

క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. కొత్తగా 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లు : రూ.32.5 కోట్లతో 25 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా మరో 13 డ్రగ్ డీఎడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్సీల్లో వైద్య ఖాళీల భర్తీ, విజయనగరంలో కొత్తగా 8 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, ఎన్టీఆర్, విజయనగరం, బాపట్ల జిల్లాల్లో డయాలసిస్ మెషిన్లు పెంచడం, కొవ్వూరు-నిడదవోలు సీహెచ్సీలను అప్గ్రేడ్ చేయడం తదితర అంశాలపైన మార్గదర్శకాలు జారీ చేశారు. కుప్పంలో డిజిటల్ నెర్వ్ సెంటర్ : కుప్పంలో అమలు చేస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అభివృద్ధి చేసిన వినూత్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం డిజిటల్ నెర్వ్ సెంటర్ (DiNC) పురోగతి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ ప్లాట్ఫామ్ను ఉపయోగించి ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ నెర్వ్ సెంటర్ దోహదపడుతుంది. దేశంలోనే అత్యధికంగా 4.47 కోట్ల (88 శాతం) మందికి రాష్ట్రంలో అభా కార్డులు జారీ అయ్యాయి. అలాగే, పీఎం జన్మాన్‌లో భాగంగా టీబీ ఎలిమినేషన్ కింద 82,693 గిరిజనులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ చేయగా 5,072 మందికి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 10,11,461 మంది గిరిజనులకు స్క్రీనింగ్ చేయగా 1,977 మందికి సికిల్ సెల్ ఎనీమియా పాజిటివ్‌గా తేలింది. రాష్ట్రంలో 95.60 శాతం జనన, మరణాల నమోదు జరిగింది. 13,26,621 శిశు ఆధార్‌లు జారీ అయ్యాయి.

# బర్డ్ ఫ్లూపై ఆందోళన అవసరం లేదు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

నరసరావుపేటలో బర్డ్ ఫ్లూ వైరస్ (H5N1) లక్షణాలతో ఇటీవల బాలిక మృతి చెందిన ఘటనపై అధ్యయనం కోసం రాష్ట్రానికి వచ్చిన ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నరసరావుపేటలో పర్యటన అనంతరం తనను కలిసిన ఐసీఎంఆర్ బృందంతో బాలిక మృతికి గల కారణాలను చర్చించారు. బాలిక నుంచి సేకరించిన నమూనాలలో H5N1 లక్షణాలు బయటపడినప్పటికీ, ఇతర అనారోగ్య కారణాలు కూడా బాలిక మృతి చెందడానికి దారితీశాయని బృందం సభ్యులు చెప్పారు. ఉడికించని మాంసం తినడం, చిన్నారి కావడంతో వ్యాధి నిరోధకశక్తి లేకపోవడం, లెప్టోస్పిరోసిస్(ఎలుకల విసర్జన వల్ల వ్యాపించే వ్యాధి), అపరిశుభ్ర వాతావరణం కూడా మృతికి కారణాలుగా తమ అధ్యయనంలో తేలిందన్నారు. ప్రస్తుతం ఆ పరిసర ప్రాంతంలో ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని, 8 బృందాలతో సర్వే చేపట్టామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో పాటు... బంధువులు, స్థానికుల నమూనాలు పరీక్షించామని... ఎవరికీ బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని చెప్పారు. దీనిపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి కేసులు నమోదుకాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో యాంటీవైరల్ డ్రగ్స్ సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.

# 74 వేల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం కొనుగోలు

ప్రజాభూమి ప్రతినిధి,వెంకటగిరి:

రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు పండించిన ప్రతి బస్తాను ప్రభుత్వము కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వెంకటగిరి మండలం యాతలూరు గ్రామము నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,రైల్వే కోడూరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ శ్రీధర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గ్రామ సర్పంచ్ పెంచాలమ్మల తో కలసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రైతు సేవ కేంద్రం ద్వారా ధాన్యము కొనుగోలు రబీ సీజన్ 2024 - 25 సంవత్సరానికి సంబంధించి రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటుగా ప్రతి బస్తాను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలోనే 7 వేల మంది రైతుల నుంచి 74 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 154 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లాలో 134 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా పెండింగ్ పెట్టిన 1674 కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించడం జరిగింది అన్నారు. రైతుల అనుభవాలను, వారి కష్టాలను తెలుసుకొనడానికి యాతలూరు గ్రామానికి రావడం జరిగిందన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వాట్సప్ ద్వారా రైతుల ధాన్యమును కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీని తీసుకొచ్చిందని, రైతులకు నచ్చిన రైసుమిల్లులకు ధాన్యమును వారు అమ్ముకోవచ్చునని రైతులకు సూచించారు. రైతుల నుండి ధాన్యము కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బు చెల్లించడం జరుగుతుందని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అయితే 24 గంటల్లోనే 90 శాతం మంది రైతులకు జమవుతుందని తెలిపారు. రైతు నుంచి ప్రతి బస్తాని కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. 17 శాతం తేమ ఉన్ననూ ధాన్యంను కొనుగోలు చేయాలని మిల్లర్ల కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. గోతాల కొరత వల్ల ఏ రైతు ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో జిల్లా కు ఐదు లక్షల గోతాలను అందజేయడం జరిగిందన్నారు. రైతుల ఆవేదనను అధికారులు అర్థం చేసుకోవాలన్నారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చోకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సాధక బాధలు తెలుసుకొని రైతులకు ధైర్యం నూరిపోయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చూడాలన్నారు. పండించిన ధాన్యాన్ని ఎప్పుడు తీసుకొచ్చినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలు సకాలంలో అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రం లో అమ్మగానే రైతులకు మీరు అమ్మినట్లుగా, మీకు డబ్బులు పడిందని, మీరు సంతోషంగా ఉన్నారా అని మీ ఫోన్ కు మెసేజ్ లు వస్తున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు వస్తున్నాయని, గతంలో రైతులు మిల్లర్ల వద్ద నాలుగైదు రోజులు పడిగాపులు కాచే వారమని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు గంటల లోపల మిల్లర్లకు అప్పజెప్పి రైతులు సంతో షంగా వస్తున్నారని రైతులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిఓ లక్ష్మి, డిఎం సివిల్ సప్లైస్ సుమతీ,మండల తహశీల్దార్, ఎంపిడిఓ మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీల నేతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంలో అగ్నిప్రమాదంపై విచారణ చేస్తాం

మొదటిపేజీ తరువాయి

కేవలం 10 నిమిషాలలోపే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారన్నారు. జీఏడీ, సీఆర్డీఏ శాఖల అధికారులు షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చారని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదంలో కేవలం బ్యాటరీలు మాత్రమే దగ్ధమయ్యాయని.. అంతకుమించి ప్రమాదం ఏమీ లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించినట్టు తెలిపారు.

## సచివాలయంలో అగ్నిప్రమాద ప్రదేశాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

అనంతరం మొదటి బ్లాక్‌లోని బ్యాటరీ రూమ్‌ను కూడా సీఎం పరిశీలించారు. ఇటువంటి బ్యాటరీ గ్యాలరీనే రెండవ బ్లాక్‌లో అగ్నిప్రమాదానికి గురైందని సీఎంకు సీఎస్ వివరించారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ విభాగాన్ని పరిశీలించారు. అక్కడి అపరిశుభ్రతపై అసంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం, 24 గంటల్లో చెత్తనంతా క్లీన్ చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో ఎక్కడా తాత్కాలికంగా కూడా చెత్త కనబడటానికి వీల్లేదని అన్నారు.

## తల్లిపై కేసు వేసిన కొడుకుగా, మేనల్లుడు, మేనకోడలు ఆస్తులు కాజేసిన మేనమామగా జగన్ నిలిచిపోతారు: షర్మిల

సరస్వతి పవర్ షేర్ల ఎంవోయూపై జగన్ సంతకాలు చేశారన్న షర్మిల

సరస్వతి పవర్ షేర్లను విజయమ్మకు గిఫ్ట్ డీడ్ గా ఇచ్చాడని వెల్లడి

తనకు ఒక్క ఆస్తి కూడా ఇవ్వలేదన్న షర్మిల



ప్రజాభూమిప్రతినిధి,విజయవాడ:-

తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సరస్వతి పవర్ షేర్ల ఎంవోయూపై జగన్ స్వయంగా సంతకాలు చేశారని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క ఆస్తి కూడా తనకు జగన్ ఇవ్వలేదని తెలిపారు. తమ తల్లి విజయమ్మకు సరస్వతి పవర్ షేర్లను జగన్ గిఫ్ట్ డీడ్ కింద ఇచ్చారని... ఇచ్చిన షేర్లు మళ్లీ తనకే కావాలని పట్టుబడుతున్నారని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కన్నతల్లిపై కేసు వేసిన కొడుకుగా, మేనల్లుడు, మేనకోడలు ఆస్తులు కాజేసిన మేనమామగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.

వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డివంటి వారిని అడ్డం పెట్టుకుని తమపై నిందలు వేశారని విమర్శించారు. జగన్ కు ఆత్మీయులకన్నా ఆస్తులే ముఖ్యమనుకుంటున్నానని చెప్పారు. జగన్ కు విశ్వసనీయత ఉందో? లేదో? వైసీపీ వాళ్లు ఆలోచించాలని సూచించారు. జగన్ ద్వంద్వ వైఖరి మరోసారి బయటపడిందని షర్మిల అన్నారు. వక్ఫ్ బిల్లులో డబుల్ స్టాండర్డ్స్ చూపించారని విమర్శించారు.

ఎన్డీయేకు బలం ఉన్న లోక్ సభలో బిల్లును వ్యతిరేకించి... కీలకమైన రాజ్యసభలో మాత్రం అనుకూలంగా ఓటు వేసిందని మండిపడ్డారు. జగన్ సూచనలతో రాజ్యసభలో వైసీపీ ఎంపీలు బిల్లుకు మద్దతు తెలిపారని చెప్పారు. జగన్ తీరును జాతీయ మీడియా ఎండగడుతోందని అన్నారు.

# మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు విధాన పత్రం రూపొందించండి

ప్రజాభూమిప్రతినిధి,హైదరాబాద్:-

తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడమని సీఎం తెలిపారు. క్షేత్ర స్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధాన పత్రం ఉండాలని,అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలని సీఎం హితవు పలికారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు.. తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫాంల పంపిణీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని.. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సీఎం సూచించారు.

మనకు ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని సీఎం సూచించారు. వివిధ రాష్ట్రాల్లోని పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ప్రస్తుతం వరకు విద్యా వ్యవస్థలోని తీసుకువచ్చిన పలు సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనాధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వివరించారు. విద్యా వ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రాథమిక విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేష్, కె.జ్యోత్స్న శివారెడ్డి, పలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు

అక్టోబర్,




ప్రజాభూమి




# సచివాలయంలో అగ్నిప్రమాదంపై విచారణ చేస్తాం

**- ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమిక నిర్ధారణ**

**- ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తగు చర్యలు : హెూంమంత్రి అనిత**

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి



సచివాలయంలోని రెండో బ్లాక్ లో జరిగిన అగ్నిప్రమాదం ఘటనపై విచారణకు ఆదేశించామని రాష్ట్ర హెూం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని ఆమె పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం 6. 30 గంటల సమయంలో రెండో బ్లాక్ లోని బ్యాటరీల నుంచి పొగలు రావడాన్ని ఎస్పీఎఫ్ సిబ్బంది గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారన్నారు. కేవలం 10 నిమిషాలలోపే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారన్నారు. జీఏడీ, సీఆర్డీఏ శాఖల అధికారులు షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చారని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదంలో కేవలం బ్యాటరీలు మాత్రమే దగ్ధమయ్యాయని.. అంతకుమించి ప్రమాదం ఏమీ లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించినట్టు తెలిపారు.

# ప్రభుత్వమే అంజలిని పొట్టనపెట్టుకుంది

**ఆస్పత్రి మార్చమని కోరినా పట్టించుకోలేదు**

**సీఎం, డిప్యూటీ సీఎం, హెూంమంత్రి కనీసం స్పందించలేదు**

**ప్రభుత్వం తరఫున ఎవరూ పరామర్శించకపోవడం దారుణం :వరుదు కళ్యాణి**

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:



రాజమహేంద్రవరంలో ఆత్మహత్యా యత్నం చేసిన ఫార్మసీ విద్యార్థిని నాగ అంజలి, 12 రోజుల తర్వాత దుర్మరణానికి ప్రభుత్వమే కారణమని ఎమ్మెల్సీ, వైయస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ధ్వజమెత్తారు. ఆ కేసులో ప్రధాన నిందితుడైన దీపక్ ఏజీఎంగా ఉన్న ఆస్పత్రిలోనే అంజలికి చికిత్స చేయొద్దని, వేరే ఆస్పత్రికి తరలించాలని కోరినా, ఆమె తల్లిదండ్రులు కూడా అభ్యంతరం చెప్పినా, ప్రభుత్వం పట్టించుకోలేదని, చివరికి 12 రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎవరూ కనీసం పరామర్శించలేదని, తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన వరుదు కళ్యాణి తెలిపారు.

ప్రభుత్వం ఉదాసీనత:ఒక నరరూప రాక్షసుడి వేధింపులకు ఫార్మసీ విద్యార్థిని నాగ అంజలి అసువుల బాసింది. తన ఆత్మహత్యకు కిమ్స్ ఏజీఎం దీపక్ కారణమని సూసైడ్ నోట్ రాసి మరీ ఆత్మహత్యా యత్నం చేసిన అంజలి పన్నెండు రోజులుగా మృత్యువుతో పోరాడి చివరికి కన్నుమూసింది. ప్రభుత్వమే అంజలిని పొట్టన పెట్టుకుంది. అంజలి కుటుంబానికి న్యాయం చేసే విషయంలో ప్రభుత్వ ఉదాసీనత కొట్టొచ్చినట్టు కనపడింది. ఏ ఆస్పత్రిలోనైతే ఆత్మహత్య ప్రయత్నం చేసిందో అదే ఆస్పత్రిలో వైద్యం అందిస్తే ఎలా న్యాయం చేసినట్టు అవుతుందని, పైగా ఇదే ఆస్పత్రిలో నిందితుడు దీపక్ ఏజీఎంగా పనిచేస్తున్నాడని అంజలి తల్లిదండ్రుల తరఫున వైయస్సార్‌సీపీ అనుమానం వ్యక్తం చేస్తూనే ఉంది. ఆస్పత్రి మార్చాలని కోరినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. నిందితుడు దీపక్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త. అందుకే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

ఆ మాటలన్నీ ఏమయ్యాయి?:

గత నెల 23న అంజలి ఆత్మహత్యాయత్నం చేస్తే ఈ 12 రోజుల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెూంమంత్రి అనితల్లో ఏ ఒక్కరూ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి పట్టించుకున్న పాపానపోలేదు. ఆమె కుటుంబాన్ని పరామర్శించడానికి కూడా ప్రయత్నం చేయలేదు. ఆడబిడ్డలకు అన్యాయం చేస్తే అదే వారికి ఆఖరి రోజు అని చంద్రబాబు, ఆడబిడ్డల మీద కన్నెత్తి చూస్తే తాట తీస్తానన్న పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి ఆడబిడ్డలు ప్రశాంతంగా నిద్రపోవచ్చని చెప్పిన హెూంమంత్రి అనిత.. ఈ ముగ్గురూ అంజలి విషయంలో ఎందుకు మౌనం వహించారో సమాధానం చెప్పాలి. వీళ్లు చేసిన వాగ్ధానాలన్నీ మాటలకే పరిమితమని, చేతల్లో చేసేదేం ఉండదని అర్థం అవుతుంది. పోలవరం సందర్శన కోసం వచ్చిన చంద్రబాబు, పక్కనే అంజలి చికిత్స పొందుతున్న ఆస్పత్రి ఉన్నా కన్నెత్తి చూడలేదు. మహిళల మీద ఎన్ని దాడులు, అఘాయిత్యాలు చేసినా మాకేం కాదన్న భరోసాతో ఉన్మాదులు స్వేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి ఎలా తయారైందంటే ఇంట్లో ఉన్నా, బడికెళ్లినా, పనికెళ్లినా, నడిచి వెళ్లినా.. మహిళలకు రక్షణ ఉండటం లేదు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్ పేరు మార్చడం మినహా, మహిళల రక్షణలో ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని వరుదు కళ్యాణి ఆక్షేపించారు.

# రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ కు 10వ తేదీ వరకు రిమాండ్

**2018లో చర్చి ఆర్థిక విషయాల్లో నమోదైన కేసులో అనంతపురము మొబైల్ కోర్టులో హాజరు పరిచిన పోలీసులు**

**అప్పటి అనంతపురం త్రీ టౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించిన నిందితుడు**

**ఈ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అనంతపురమునకు పిటి వారెంట్ పై తీసుకొచ్చిన పోలీసులు**

ప్రజాభూమి బ్యూరో, అనంతపురము

రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ నేత, రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్ ను అనంతపురం పోలీసులు శుక్రవారం స్థానిక మొబైల్ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా నిందితుడికి కోర్టు ఈనెల 10వ తేదీ వరకు రిమాండ్ విధించింది. అనంతరం అతనిని తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. 2018లో అనంతపురంలోని రామచంద్ర నగర్ లో ఉన్న ఓ చర్చికి సంబంధించి ఆర్థిక లావాదేవీల వివాదాల నేపథ్యంలో బోరుగడ్డ అనిల్ పై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈ వివాదంలో అప్పటి సీఐ మురళీకృష్ణను తాను ఐఏఎస్ అధికారి గవర్నమెంట్ ఫైనాన్షియల్ అడ్వైజర్ రాజశేఖర్ ను అని, తాను చెప్పినట్లు నడుచుకోవాలని ఒత్తిడి చేశారు. అంతేకాకుండా కానుకల విషయంలో తిమోతి వర్గానికి సపోర్ట్ చేయాలంటూ అనిల్ బెదిరించారు. రెండు సిమ్ కార్డుల నుంచి వచ్చిన ఫోన్ కాల్ నంబర్లను తీసుకుని విచారణ చేయగా, బోరుగడ్డ అనిల్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చినట్లు నిర్ధారణ కావడంతో సీఐ మురళీకృష్ణ ఉన్నత పోలీసు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అయితే రాజమండ్రి సెంటర్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అనిల్ అనంతపురంలో మొబైల్ కోర్టుకు హాజరు కాలేకపోవడంతో పోలీసులు అరెస్ట్ వారెంట్ ఇష్యూ చేశారు. ఈ సందర్భంగా బోరుగడ్డ అనిల్ ను పిటి వారింటి పై అనంతపురము త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కు రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి తీసుకొచ్చారు. అనంతరం శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులోని మొబైల్ కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా కోర్టు వద్ద ఏర్పాటు చేశారు. ఈ కేసు విషయమై బోరుగడ్డ అనిల్ తరఫు న్యాయవాది నారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, పిటి వారెంట్ పై అనిల్ ను స్థానిక మొబైల్ కోర్టులో హాజరు పరిచారన్నారు. ఈనెల 10వ తేదీ వరకు మొబైల్ కోర్టు జడ్జి రిమాండ్ విధించారన్నారు. అనంతరం అతనిని తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తీసుకెళ్లారని, ఈనెల 10న మొబైల్ కోర్టుకు హాజరు కావాల్సి ఉందని, ఆయన రాలేని పక్షంలో పోలీసులు హాజరు పరచాల్సి ఉంటుందని తెలిపారు.





# పోలవరంపై కేంద్రంతో రాజీపడ్డ చంద్రబాబు - పోలవరం ఎత్తు 41.15 మీటర్లకే పరిమితం

**- ఈ మేరకు జలశక్తిశాఖ వార్షిక నివేదికలో స్పష్టం చేసింది**

**- దీనిపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నోరుమెదపడటం లేదు**

**- చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌లో షర్మిలమ్మ పావు**

**- షర్మిలమ్మ నైతికత ప్రశ్నార్థకం: మాజీ మంత్రి అంబటి రాంబాబు**

ప్రజాభూమి ప్రతినిధి,గుంటూరు:

లోకేష్‌ను భవిష్యత్ సీఎంగా చేసుకునేందుకు బీజేపీ అండకోసం పోలవరం ఎత్తుపై కేంద్రంతో చంద్రబాబు రాజీపడ్డారని మాజీ మంత్రి, గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా కేంద్ర జలశక్తిశాఖ విడుదల చేసిన వార్షిక నివేదికలో పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తున్నామని స్పష్టం చేసినా సీఎం చంద్రబాబు నోరు మెదపడం లేదని అన్నారు. రాష్ట్ర జీవనాడి పోలవరంను తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. ఇంకా ఆయనేమన్నారంటే...'ఎన్డీఏ కూటమి వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోంది. చంద్రబాబు విభజిత ఏపీకి సీఎం అయిన తరువాత విభజన చట్టంలో ప్రత్యేక హెూదా ఇస్తామని చెబితే దానికి బదులుగా ప్రత్యేక ప్యాకేజీ అడగటం వల్ల రాష్ట్రం నష్టపోయింది. ప్రత్యేక హెూదాను మంటగలిపిన వ్యక్తి చంద్రబాబు. ఇవ్వాళ అంతకన్నా మరో ప్రమాదకరమైన నిర్ణయాన్ని చంద్రబాబు తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్‌ను సర్వ నాశనం చేసే విధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. పోలవరంకు రెండు లెవల్స్ ఉన్నాయి. మొదటి లెవల్ 41.15 మీటర్లు కాగా, రెండో లెవల్ 45.72 మీటర్లు. ఈ రెండో లెవల్ వరకు రిజర్వాయర్‌లో నీటిని నిలపగలిగితేనే పూర్తిస్థాయి సామర్థ్యంతో ప్రాజెక్ట్ ను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. కృష్ణాడెల్టాకు కావాల్సిన 80 టీఎంసీలు, గోదావరి డెల్టా స్థిరీకరణ, విశాఖపట్నంలోని పారిశ్రామిక అవసరాలకు నీటిని, ఉత్తరాంధ్రకు తాగునీటిని అందించాలంటే ఖచ్చితంగా పోలవరం ఎత్తు 45.72 మీటర్లు ఉండాల్సిందే. అప్పుడే రిజర్వాయర్‌లో 194.6 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.



**- జలశక్తి వార్షిక నివేదికపై స్పందించండి**

తాజాగా 41.15 మీటర్లకే ప్రాజెక్ట్ ఎత్తును పరిమితం చేస్తూ, దానికి మాత్రమే నిధులు ఇస్తామని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ తన వార్షిక నివేదికలో స్పష్టం చేసింది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అంగీకారం తెలిపారు. దీనికి గానూ రూ.12,157.53 కోట్లు ఇచ్చి ప్రాజెక్ట్ బాధ్యత నుంచి తప్పుకుంటున్నామని జలశక్తి శాఖ పేర్కొంది. ఇది తప్పని రాష్ట్రప్రభుత్వం చెప్పగలదా? తెలుగుదేశంకు వంతపాడే ఈనాడు, ఆంధ్రజ్యోతి దీనిని ఖండిస్తూ కథనం రాయగలవా? ప్రాజెక్ట్‌ను 45.72 మీటర్లకు ప్రాజెక్ట్ నిర్మాణం చేయాలంటే దానికి ఇంకా రూ.25వేల కోట్లు కేంద్రం ఇవ్వాల్సి ఉంది. దీనిని ఇవ్వడం కుదరదని కేంద్రప్రభుత్వం చేతెలెత్తేస్తే, సీఎం చంద్రబాబు దానికి అంగీకరించారు. పోలవరం పోయినా ఫరవాలేదు, ఆయనకు ఉన్న సొంత ప్రయోజనాలే ముఖ్యం. ఇది ఇలా ఉంటే కొత్తగా బనకచర్ల, గేమ్‌ఛేంజర్ అంటూ మరో కొత్త డ్రామాకు చంద్రబాబు తెరతీశారు. గోదావరిడెల్టా స్థిరీకరణకు కూడా నీరు అందించలేని స్థితికి పోలవరం ప్రాజెక్ట్‌ను తీసుకువస్తున్నారు. దీనిమీద గతంలోనే చాలాసార్లు మా ఆందోళనలను వెల్లడించాం. పోలవరం ఎత్తును తగ్గించేస్తున్నారంటే, లేదు తరువాత దీనిని మేం పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి రామానాయుడు సమర్థించుకుంటున్నారు. రాష్ట్రం కాదు నిధులు ఇచ్చే కేంద్రంతో ఈ మాట చెప్పించాలని డిమాండ్ చేస్తే వారి నుంచి ఎటువంటి సమాధానం లేదు. చాలా దుర్మార్గమైన విధానాలకు పాల్పడుతున్నారు. ముగ్గురు కేంద్రమంత్రులు ఉండి కూడా రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే కనీసం మాట్లాడటం లేదు. పోలవరం ప్రాజెక్ట్‌కు వెన్నుపోటు పొడుస్తున్నారు. పోలవరం అనేది స్వర్గీయ వైయస్ రాజశేఖరరెడ్డి గారి కల. ఈ రాష్ట్ర ప్రజల జీవనాడి. కేవలం 115.44 టీఎంసీలకు పరిమితమయ్యే పరిస్థితిని తీసుకువస్తున్నారు. దీనిపై పవన్ కళ్యాణ్ నోరు విప్పాలి.

## నాగ అంజలి తల్లిదండ్రులకు న్యాయం చెయ్యాలి

**కిమ్స్ హాస్పిటల్ వారు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి**

**నాగ అంజలి మృతికి సంతాపం-**

**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం





కిమ్స్ హాస్పిటల్ లో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ నాగ అంజలి అదే హాస్పిటల్లో పనిచేస్తున్న దీపక్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు గురి అయ్యి నాగాంజలి చికిత్స పొందుతూ ఈరోజు మరణించిందని దీనికి ఎంతో చింతిస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతినిధులు చేరుకొని నాగాంజలి మృతికి వారి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కూతురి మృతితో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులను ఓదార్చి వారికి ధైర్యం చెబుతూ కూతురు లేని లోటుని తీర్చలేనిదని చింతిస్తూ ఈ వృద్ధాప్యంలో వారికి కూతురు తోడు లేకపోవడం చాలా బాధాకరమని ఈ అఘాయిత్యానికి పాల్పడిన దీపక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కఠినాతి కఠినంగా శిక్షించాలని, వీలైతే ఎన్కౌంటర్ కూడా చేయాలని సూచిస్తూ, ఆమె తల్లిదండ్రులకు ఆసుపత్రి యాజమాన్యం కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి కోరారు. కోటి రూపాయలు నష్ట పరిహారం కిమ్స్ హాస్పిటల్ వారు ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ ఆ వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలిచి కోటి రూపాయలు నష్ట పరిహారం ఇచ్చేవరకు పోరాటం చేస్తామని అన్నారు. ఇటువంటి సంఘటనకు ఎవరు పాల్పడిన అటువంటివారిని బహిరంగంగా దండించాలని అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రతినిధులు విలేకరులతో అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి, సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా షరీఫ్, హర్షద్, కొండరాజు, బెజవాడ రంగారావు, ఎండి రఫీ ఉల్లా బేగ్, ఎండి ఫసి ఉల్లా బేగ్, ఎండి హబీబుల్లా బేగ్, కాలీషా మస్తాన్, డాక్టర్ వడయార్, డాక్టర్ శ్రీనివాస్ వడియార్, మోతా శారద, షేక్ లలిత,ఎండి షహన్నా, బిల్డర్ బాబి, యాళ్ల వీరభద్రరావు, బత్తిన చంద్రరావు, పి. సత్యనారాయణ రాజు, యు. సత్తిబాబు, దెయ్యాల రాజు, దడాల సత్యనారాయణ, దయ్యాల కృష్ణ, డి. రమణ, ఎం. వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు

## నాగాంజలి మరణం బాధాకరం

**ఆమె ఆఖరి కోరిక ప్రకారం దీపక్ కి కఠిన శిక్ష పడాలి.ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి...**

**హాస్పటల్ యాజమాన్యం కూడా సాయం అందించాలి....**

**నిందితుడి నుంచి ఆర్థిక సహాయం ఇవ్వడంకంటే దుర్మార్గం మరొకటి ఉండదు ..**

**న్యాయం జరిగేవరకు అండగా ఉంటాం**

**మాజీ ఎంపీ భరత్**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం





నాగాంజలి మరణం అత్యంత బాధాకరమని మాజీ ఎంపీ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. ఆమె మరణవార్త తెలుసుకుని పోస్ట్ మార్టం చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగాంజలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితురాలు సూసైడ్ నోట్ లో ఏం కోరుకుందో దానిపై తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. దీపక్ కి కఠినాతి కఠిన శిక్ష పడాలని నాగాంజలి కోరుకుందని, అది నెరవేరే విధంగా చర్యలు తీసుకోవాలని భరత్ డిమాండ్ చేసారు. దీపక్ లాంటి కీచకులకు తగిన శిక్ష విధించడం ద్వారా ఇలాంటి ఘటనలు జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నాగాంజలి కుటుంబాన్ని ఆదుకోడానికి ప్రభుత్వం , కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ఇవ్వడంతో పాటు ఆసుపత్రి యాజమాన్యం కూడా సాయం అందించాలని భరత్ డిమాండ్ చేసారు.

తానేదో రాజకీయం చేస్తున్నట్లు కొందరు పేర్కొనడం తగదని భరత్ పేర్కొన్నారు. ఆరోజు విద్యార్థులు ధర్నా చేస్తున్నప్పుడు తెలుసుకుని వెళ్లానని ఆయన అన్నారు. తానె స్వయంగా ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందా , ఎవరైనా ఇంజక్షన్ చేసారా అనే అనుమానాస్పద ఘటన నేపథ్యంలో ఆ అమ్మాయికి తగిన న్యాయం జరిగేవరకు అండగా ఉండాలని భావించామని భరత్ పేర్కొన్నారు. అపుడే విషయం బయటకు వచ్చిందని, లేకుంటే ఆరోజు సాయంత్రమే చక్కబెట్టేసి ఉండేవారని ఆయన అన్నారు. ఎందుకంటే విషయం బయటకు వచ్చాకే దీపక్ పై కఠిన సెక్షన్లు పెట్టారన్నారు.

పోలీసు శాఖను మమేకం చేస్తూ, గతంలోతాము దిశ యాప్ తీసుకొచ్చామని భరత్ గుర్తుచేశారు. ఇప్పుడు శక్తి యాప్ తెచ్చి ఉపయోగం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అసలు ఈ ఘటనపై హెూం మంత్రి కూడా స్పందించకపోవడం, కనీసం ఒక ట్వీట్ కూడా చేయకపోవడం దారుణమని ఆయన అన్నారు. దీన్నిబట్టి కూటమి ప్రభుత్వం ఆడపిల్లలకు ఇచ్చే గౌరవం ఈమాదిరిగా ఉందో అర్థం అవుతోందని భరత్ అన్నారు. ఆర్థిక సాయం చేస్తున్నట్లు ఎవరివరో చెప్పడం వింతగా ఉందన్నారు. అలా ఇచ్చే సాయం ఎక్కడ నుంచి ఇస్తున్నారో చెప్పాలని భరత్ డిమాండ్ చేసారు. ఒకవేళ నిందితుడు నుంచి ఆర్థిక సహాయం బాధితురాలికి ఇస్తున్నారంటే, అంతకంటే దుర్మార్గం ఏమీ ఉండదని ఆయన వ్యాఖ్యానించారు.

## అట్టహాసంగా ప్రారంభం అయిన అమరావతి చిత్రకళ ప్రదర్శన

**విద్యార్థులను చేయి చేయి కలిపిన ఉత్సాహం నింపిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మంత్రి దుర్గేష్**

**ముఖ్యమంత్రి గీసిన చిత్రాన్ని రూ.1,01,116 కు కొనుగోలు చేసిన డిప్యూటీ స్పీకర్**

**స్టాల్స్ ను సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయక్వం లో కళకు పూర్వ వైభవం వస్తుందన్న విశ్వాసం ఈ వేడుకల నిర్వహించడం ద్వారా తేటతెల్లం అయిందని సాజన్ సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందులశుక్రవారం స్థానిక సెంట్రల్ జైలు ప్రధాన రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన అమరావతి చిత్రకళ ప్రదర్శన ను అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణంరాజు మాట్లాడుతూ, చిత్ర కళా ప్రదర్శనల్ని వీక్షించేందుకు వొచ్చిన ఇక్కడ అందరూ నవ్వు తూనే వున్నరు. రాష్ట్రంలో కళలకి, కళాకారులకి పూర్వ వైభవం ఖచ్చితంగా వస్తుందని పేర్కొన్నారు. కళలకి పుట్టినిల్లు అయిన రాజమహేంద్రవరం లో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రతిపాదన, అందుకు అనుగుణంగా ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి ఏర్పాటు చేసిన విధానం అభినందనీయం అన్నారు. అమరావతి చిత్ర కళా ప్రదర్శనల్ని ఎంతో స్ఫూర్తి వంతమైన విధానంలో ఏర్పాట్లు చేసిన తేజస్విని ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందనన్నారు. ఈ ప్రదర్శన చూడడం తొ పాటు కళలని, కళాకారులని ప్రోత్సహిస్తూ వాటిని కొనుగోలు చేయాలని కోరారు. ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కళ ప్రదర్శనల కుఅమరావతి పేరు పెట్టారు కదా అమరావతి లో పెడితే బాగుంటుంది అని నేను సూచిస్తే, రాష్ట్ర సాంస్కృతిక రాజధాని లో పెట్టడం సముచితం అని మంత్రి దుర్గేష్ సూచించడం జరిగిందన్నారు. రాజమండ్రీ సెంట్రల్ జైలు రోడ్ లో చాలా చెట్లు ఉన్నాయి.చాలా బాగుంది.ఇక్కడ చెట్లు బాగా పెరిగాయి..రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, దేశం లోనే విజన్ ఉన్న ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ల ఆలోచనలో ఇక్కడ అమరావతి చిత్ర కళా ప్రదర్శనల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళలనీ ప్రోత్సహిస్తూ కళాకారులకి పూర్వ వైభవం తీసుకుని వొచ్చేందుకు చిత్త శుద్ధి కలిగి ఉందన్నారు. ..ఇక్కడ కు అనేక మంది కళాకారులు వచ్చారు...ఆర్టిస్ట్ లకు పెట్టినవి చూసి, వారి ప్రతిభను గుర్తించాలని, వాటిని కొని కళాకారులకి చేయూత ఇవ్వలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనవలసి ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు పురంధేశ్వరి అనివార్య కారణాలు, ఇతర కార్యక్రమాల వలన రాలేక పోయారన్నారు. రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఒక మంచి అధికారి అని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గా పనిచేస్తు, రాష్ట్ర పర్యటక శాఖ అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. చైర్ పర్సన్ తెజేస్వి అధ్వర్యంలో ఇంత చక్కటి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ , కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం అంటే గుర్తుకు వచ్చేలా .. కళలకి కణాచికగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రన్నీ తీర్చి దిద్దేలా అడుగులు వేయడం జరుగుతోందనీ అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామ కృష్ణ లు మాట్లాడుతూ, రాజమండ్రి నగరంలో ఇటువంటి కార్యక్రమాన్నీ చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం కు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. అమరావతి అనే పేరు లోనే వైబ్రేషన్ వుందన్నారు. నిజం జీవితం లో మన రఘు రామ కృష రాజు గారు ఒక అల్లూరి సీతారామ రాజు వంటి పాత్ర పోషించడం చూడమన్నారు. గత ప్రభుత్వం హయంలో కళకి ప్రాధాన్యత ఇవ్వడం అటుంచి, ఇటువంటి కార్యక్రమాలు ఒక్కటి నిర్వహించలేదు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైను, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్, సాంస్కృతిక శాఖ సంచాలకులు డి మల్లికార్జునరావు, పలువురు కళాకారులు అధికారులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



## ట్రైకార్ చైర్మన్ నిలుదీసిన అంజలి కుటుంబ సభ్యులు నచ్చచెప్పి ప్రయత్నం చేసిన ట్రైకర్ శ్రీనివాసరావు

ప్రజా భూమి, జీలుగుమిల్లి



కార్పొరేటర్ సంస్థ అయిన కిమ్స్ హాస్పిటల్ హత్య చేశారంటూ అంజలి కుటుంబ సభ్యులు 13 రోజుల నుండి వివిధ రకాలుగా ఆందోళన చేపట్టిన ఎటువంటి న్యాయం జరగలేదని అంజలి తల్లిదండ్రులు వాపోయారు. అంజలి పార్థ దేహం రౌతు గూడెం తీసుకొచ్చారు అని తెలిసిన వెంటనే ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. జీలుగుమల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన నల్లపు అంజలి రాజమండ్రి కిమ్స్ హాస్పిటల్ నందు ఆత్మహత్యనికి పాల్పడిన సంగతి తెలిసినదే హాస్పిటల్ లో మృత్యువుతో పోరాడి ఈ రోజు మృతి చెందడం బాధాకరం అని అంజలి కుటుంబనీకి తీరనిలోటు అని అంజలి కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. వారిని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు అన్నారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు సుంకవల్లి సాయి, పొలమేరా శివాజీ, తోట బాలు, అక్కిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ నాని శ్రీను పరామర్శించిన ట్రైకర్ చైర్మన్

ప్రజా భూమి, జీలుగుమిల్లి



ఎంపీటీసీ నాలి శ్రీనివాసరావు కుటుంబాన్ని కుటుంబ సభ్యుల్ని పరామర్శించిన ట్రైకర్ చైర్మన్ బూర్గం శ్రీనివాస్ . ఇటీవల అనారోగ్యంతో శ్రీను వదిన అకాల మృతి చెందడంతో ఆయన పరామర్శించారు. పరామర్శిం చిన వారిలో మండల నాయకులు సాయి కృష్ణ శివాజీ, ఎంపీటీసీ ఉదయ్ కుమార్, పేరు పోయిన దాము, తోట బాలు, ఆంజనేయులు, కిరణ్, ఉన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాభూమి,వి.ఆర్.పురం



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి రాజు, అధ్యక్షతన సీనియర్ అసిస్టెంట్ చినబాబు చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా వచ్చిన నోట్స్ బుక్స్ ను విద్యార్థులకు పంపిణీ చేశారు. తెల్లనోడ్స్ పుస్తకాలు 6, రూల్ నోడ్స్ పుస్తకాలు 6, ఒక్కొక్క విద్యార్థికి మొత్తం 12 నోట్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఇంటర్ షెడ్యూల్ మారింది, ఎందుకంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కూడా ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలతో పోటీపడేలా విద్యార్థులకు ఈ సంవత్సరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఏప్రిల్ ఒకటి నుండి విద్యార్థులకు ఏప్రిల్ 24 వరకు కళాశాలలో తరగతులు జరుగుతాయని విద్యార్థులందరూ హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అతిథి అధ్యాపకులు ఇంగ్లీష్ టీచర్ ఎస్ నరసింహారావు, ఫిజిక్స్ అధ్యాపకులు జీ వెంకటేశ్వర్లు, బోటనీ అధ్యాపకులు జి శివరాజు , కే బాలుపాల్గొన్నారు.

## నివాసిత గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దు: సిపిఎం

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



విద్యుత్ వినియోగంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు డిమాండ్ చేసింది. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బుట్టాయిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు బిగింపు చెయ్యొద్దు, అదనపు చార్జీలు పేరుతో పేదలపై భారాలు పెట్టొద్దు, ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు చార్జీలు పెంపులు భాగంగా స్మార్ట్ మీటర్లు బిగింపు చేస్తున్నాయని, తక్షణమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ కు, బుట్టాయిగూడెం తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దారు చలపతిరావుకు వినతిపత్రం అందించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయిగూడెంలో గిరిజనులు వేసుకున్న ఇళ్ల స్థలాలు తక్షణమే సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎంత ఉందో తేల్చాలని అన్నారు. గిరిజనులు వేసుకున్న నివాసాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇనుమూరు, మర్లగూడెం జైనవారిగూడెం గ్రామాల్లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం చేయుట కొరకు తక్షణమే భూ రికార్డు పరిశీలన చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ బుట్టాయగూడెం మండల కమిటీ సభ్యులు పోలోజు నాగేశ్వరావు, తామ ముత్యాలమ్మ, కుర్సం భీమరాజు, చంద్రు బుల్లమ్మ, మడకం శ్రీదేవి, కొమరం సత్యనారాయణ., సోయం శ్రీనివాసు, మడివి రాము, పాల్గొన్నారు.

## చిల్లీస్ పరిశ్రమతో పలువురికి ఉపాధి అవకాశాలు. ఐటిడిఏ పిఓ రాములు నాయక్.

ప్రజాభూమి,బుట్టాయగూడెం

చిల్లీస్ పరిశ్రమతో పలువురికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కోట రామచంద్రపురం, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. స్థానిక సంత మార్కెట్ వద్ద నిర్మాణంలో ఉన్న చిల్లీస్ పరిశ్రమను శుక్రవారం పి వో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రు. 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ చిల్లీస్ పరిశ్రమ తుదిమెరుగులు దిద్దుకుని, త్వరలోనే ప్రారంభానికి సిద్ధం కానుందని చెప్పారు. ఇది ఇప్పటికే ప్రారంభం కావలసి ఉన్నప్పటికీ ప్యాకేజీకి సంబంధించిన యంత్రాలు రావడం ఆలస్యం కావడంతో పరిశ్రమ ప్రారంభానికి ఆటంకాలు ఎదురయ్యాయని అన్నారు. త్వరలోనే జిసిసి ఆధ్వర్యంలో ఈ పరిశ్రమను ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ పరిశ్రమ కారణంగా ఈ ప్రాంతంలోని మిర్చి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, వినియోగదారులకు నాణ్యమైన మిర్చి కారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈయన వెంట జిసిసి సిబ్బంది ఉన్నారు.



## ఎస్డిసి కోర్టులోగిరిజనులకు జరుగుతున్న అన్యాయం పై స్పందించాలి: కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ. ఫ్రాన్సిస్.

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



కోట రామచంద్రపురం, ఎస్ డి సి కోర్టులో గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రాములు నాయక్, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, అధికారులు స్పందించాలని ఏలూరు జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం బుట్టాయిగూడెం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మండలంలోని జగ్గిశెట్టి గూడెం రెవెన్యూ పరిధిలో మూడు తరాల నుండి గిరిజనులు సాగు చేసుకుంటున్న 33 ఆర్ఎస్ఆర్ దాఖల 36 ఎకరాల జి రాయితి భూములు కేర్ పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ట్రైబల్ కి వ్యతిరేకంగా నాన్ ట్రైబల్ భూస్వామికి అక్రమ పద్ధతిలో ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. పూర్వపరాలు పరిశీలించకుండా భూస్వాములకు తప్పుడు పద్ధతిలో స్పెషల్ డిప్యూటీ ట్రైబల్ కలెక్టర్ తప్పుడుగా ఇచ్చిన ఆర్డర్ ని సమగ్ర దర్యాప్తు జరిపించి, తప్పుడు ఆర్డర్లు ఇచ్చిన కేఆర్ పురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఫ్రాన్సిస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలోని కొందరు అధికారులు ట్రైబల్ భూమిని తప్పుడు ఆర్డర్లతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో పెట్టి, కోట్ల రూపాయల అక్రమంగా సంపాదనకు అలవాటు పడి, గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని నీరుగారుస్తున్నారని, ట్రైబల్ అభివృద్ధి కోసం ఐటిడిఏ ఉందని ప్రభుత్వాలు చెబుతున్నాయి కానీ ఇక్కడ జరిగేదంతా నాన్ ట్రైబల్ కి అనుకూలంగా తీర్పులిస్తున్నారని, ఈ ఐ టి డి ఏ పరిధిలో ట్రైబల్ సంక్షేమం కోసం ఏర్పడిన ట్రైకార్ చైర్మన్ ఉన్న గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పిఓ, ట్రైకర్ చైర్మన్ కలగజేసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. తప్పుడు ఆర్డర్లతో గిరిజనులను మోసం చేస్తున్న అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఐటిడిఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పై సమగ్ర దర్యాప్తు జరిపించి, వాస్తవాలను బయటకు తీయాలని లేనిపక్షంలో గిరిజన, దళిత ప్రజాసంఘాల ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజనులు సూర్యచంద్రం, బాబురావు, రామారావు, నాగార్జున, పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అంజలి ఆత్మహత్య కేసు

**13 రోజులు పాటు ముత్యువుతో పోరాడి**
**కార్పొరేట్ వ్యవస్థకు తలవాల్సిన అంజలి**
**అంజలి అత్యుపై నేటి వరకు కూడా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం**
**రౌతు గూడెంలో అడుగున పోలీసులు పహారా**
**నిఘా సంస్థల ఆధ్వర్యంలో అంజలి దహన సంస్కారాలు**





ప్రజా భూమి ప్రతినిధి, జీలుగుమిల్లి

పుష్కర కాలం పాటు నోములు వ్రతాలు పుణ్యాలు చేయగా పుట్టిన బిడ్డ నల్లాపు అంజలి కార్పొరేట్ సంస్థలకు బలయిందని బంధువులు తీవ్రన ఆరోపణలు గుప్పించారు. నెలరోజుల్లోపు ఇంటికి తిరిగి వస్తానన్న అంజలి పార్థ దేహంతో ఇంటికి రావడంతో జీలుగుమిల్లి మండలంలోని ములుగులం పల్లి పంచాయతీలో గల రౌతు గూడెంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఏ ఒక్కరికి సాధ్యం కానీ పరిస్థితి నెలకొంది. ఓ పక్కన పోలీసులు పహారా, ఎవరితోనూ మాట్లాడనివ్వని పరిస్థితి, ప్రభుత్వం కూడా పట్టించుకోని పాపం వెలసి ఆ తల్లిదండ్రులకు కన్నీటి వేద మిగిల్చింది. ఆత్మ అత్యాయనలతో బ్రెయిన్ డెడ్ తో ముచ్చుతో పోరాడి ఈరోజు తెల్లవారుజామున గుండెపోటుతో మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో హుటా హుటిన వందల మంది రాజమండ్రి తరలి వెల్లారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వద్ద పంచినమ్మ నిర్వహించిన అనంతరం పోలీసుల పహారాలో మృతదేహాన్ని రౌతు గూడెం తీసుకొని వచ్చారు. అప్పటికే కోపోద్రోహులైన జన సమూహం రోడ్లపై బైఠాయించి పోలీసులకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన పోలీసులు ఎక్కడికి అక్కడ బందోబస్తు ఏర్పాటు చేసి దగ్గరుండి దహన సంస్కారాలు నిర్వహించారు. పోలవరం శాసనసభ్యులు బాలరాజు కిమ్స్ హాస్పిటల్ కి వెళ్లి పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఇంత జరిగిన రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆ తల్లిదండ్రులకు ఏ విధమైన హామీ ఇవ్వకపోవడం శోచనీయం అని అంజలి మృతదేహం చూసిన ప్రతి ఒక్కరు ఆ పోతున్నారు. ఈమె బలహీన వర్గానికి చెందిన డాక్టర్ కనుకనే న్యాయం జరగలేదని ప్రతి ఒక్కరు వాపోతున్నారు. డిప్యూటీస్ సీఎం పవన్ కళ్యాణ్ ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఒక న్యూస్ మాత్రం హల్చల్ చేస్తుంది. ఏది ఏమైనా ఆ వృద్ధ దంపతులను ఓదార్చడం ఏ ఒక్కరు తరం కాని పరిస్థితి. ఆ అల్ సెల్ పైనే అందరూ చూపులు ఉన్నాయి. ఆయనైనా ఆదుకుంటాడని నమ్మకంతో ఆ ప్రాంతపు వాసులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలువురు రాజకీయ నాయకులను ఆ ప్రాంతపు వాసులు నిలదీస్తున్నారు. పార్టీలు ప్రమేయం లేకుండా అందరూ కూడా అంజలి కుటుంబం నీకు అండగా ఉన్నారు.

## ప్రతిష్టాత్మకంగా నవోదయ 2.0 అమలుకు కృషి: ప్రొహిబిషన్ &ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత.

ప్రజాభూమి,బుట్టాయగూడెం.



నాటు సారా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయ 2.0 కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేయడానికి కృషి చేయాలని ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత తెలిపారు. రాజానగరంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఇతర అధికారులు మాట్లాడుతూ నాటుసారా తయారీని ప్రభుత్వం ఎట్టి పరిస్థితులను ఉపేక్షించదని చెప్పారు. నాటు సారా తయారీ, అమ్మకం వంటి వృత్తులను మానుకొని సామాజికంగా గౌరవప్రదమైన ఇతర వృత్తులను, వ్యాపారాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. తమ కుటుంబాలలోని పిల్లలను పాఠశాలలకు పంపించాలని, ఉన్నత విద్యల ద్వారా పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. గౌరవప్రదమైన వృత్తులు, మంచి అలవాట్లు, విద్య, ఆరోగ్యం మన చుట్టూ ఆరోగ్యకరమైన సమాజాన్ని సృష్టించగలవని అన్నారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఐటీడీఏ పీవో రాములు నాయక్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేబీఎన్ ప్రభు కుమార్, డిపి ఈవో ఏ ఆవులయ్య, ఏ ఈ ఎస్ అజయ్ కుమార్ సింగ్, జి పాండురంగారావు, రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారులతో పాటు,ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు

## నిర్వాసిత గ్రామాల్లో జరిగిన ఆర్ అండ్ ఆర్ భూసేకరణ గ్రామసభలు

ప్రజాభూమి, వి.ఆర్.పురం






వి.ఆర్.పురం, కూనవరం మండలాలలో అధికారులు ఆర్ అండ్ ఆర్ భూసేకరణ గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. వి.ఆర్.పురం, కూనవరం మండలాల్లోని పోలవరం మొదటి ఫేజ్ 1బి లో ముంపుకు గురి అవుతున్న 32 గ్రామాలలో భాగంగా కూనవరం మండలంలోని శబరి కొత్త గూడెం, పెద్దర్కూరు, టేకుబాక, టేకులబోరు, అదేవిధంగా మధ్యాహ్నం నుంచి వి.అర్.పురం మండలంలోని రాజుపేట, కన్నయిగూడెం, కొప్పల్లి, సోముల గూడెం, ధర్మ తాళ్ళగూడెం, శబరిరాయి గూడెం, గ్రామలలో భూ సేకరణ, ఆర్ %ఢ% ఆర్ గ్రామ సభలు నిర్వాసితుల యొక్క గ్రామాలలో నిర్వహించారు. జరిగిన గ్రామ సభ లలో ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు అపూర్వ భరత్ ప్రతి గ్రామసభలో హాజరు కావటం జరిగినది. ఈ గ్రామ సభలలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కి సంభందించిన అర్హుల, అనర్హుల యొక్క వివరాలు నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ 10 గ్రామాలలో మొత్తం 2962 పిడిఎఫ్ లకు 2697 మంది ను అర్హులుగా గుర్తించడం జరిగినది అని ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ తెలిపారు. ఈ గ్రామ సభలో అనర్హుల యొక్క జాబితాను రిమార్క్స్ తో నిర్వాసితులకు అందించడం అయినది. అదే విధంగా అనర్హుల జాబితాలో ఏమి అయిన అభ్యంతరాలు ఉంటే ఆధారాలు గ్రామ సభ జరిగిన నాటి నుండి సదరు మండల తహశీల్దార్ లేదా, సదరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లేదా, ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారికి సమర్పించాలని వాటిని మరల ఫిజికల్ వెరిఫికేషన్ కోసం సదరు అధికారులకు పంపించి అర్హుల అయినచో వారిని అర్హుల జాబితాలో చేర్చి ఆర్ & ఆర్ ప్యాకేజీ కొరకు ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా అర్హుల లేదా అనర్హుల రెండిటి జాబితాలో కూడా పేర్లు లేని వారు కూడా కొత్తగా అర్జీ ఇవ్వవచ్చు అని వాటిని మరల పరిశీలనకు పంపించి అర్హులు అయినచో వారిని తదుపరి జాబితాలో చేర్చి ఆర్ & ఆర్ ప్యాకేజీ కి ప్రతిపాదనలు పంపించి ప్యాకేజీ ఇస్తాము అని ప్రాజెక్ట్ అధికారి వారు పేర్కొన్నారు. అనర్హుల జాబితాలో ఉన్నవారు మరియు జాబితాలో పేరు లేని వారు ఎవరు కూడా అధైర్య పడవద్దు అని ఈ సందర్భంగా అన్నారు. ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పీసా కమిటీ మెంబెర్స్ , మీడియా ప్రతినిధులు మరియు ప్రజలు గ్రామ సభల నిర్వహణకు అధికారులు వారికి సహకారం అందించాలని కోరారు. తదుపరి మిగిలిన ఫేస్ 1 బి లోని గ్రామాలకు కూడా వచ్చే వారం అర్ %ఢ% ఆర్ గ్రామ సభలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాము అని తదుపరి మిగిలిన గ్రామాలలో కొంత మంది నిర్వాసితుల యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు ఐడి, హౌస్ టెక్స్, ఎలక్ట్రిసిటీ బిల్లు, కాస్ట్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్ ఫస్ట్ పేజీ ఇ టి సి., వంటి ప్రూఫ్స్ కొంత మందికి పోలవరం ఎల్లారమ్ పోర్టల్ లో సమర్పించ లేదు. మిగిలిన గ్రామాల ప్రజలు ఎవరికైతే కొంతమంది డాక్యుమెంట్స్ అప్లోడ్ అవ్వని వారిని సదరు పంచాయతీ కార్యదర్శిలు ప్రజలను సంప్రదించడం జరుగుతుంది, కావున పంచాయతీ సెక్రెటరీ వారు కోరిన డాక్యుమెంట్స్ సకాలంలో అందించాలని కోరారు. ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు స్వయంగా ప్రతి గ్రామ సభలో పాల్గొన్ని నిర్వాసితుల సందేహాలకు జవాబులు చెప్పారు. ఈ గ్రామ సభలలో అనర్హుల అయిన వారు మరియు కొత్త వారి నుండి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారు సుమారు గా 193 అభ్యంతరాల దరఖాస్తులు స్వీకరించారు.. అర్హులైన ప్రతి ఒక నిర్వాసుతుడికి ఆర్ %ఢ% ఆర్ ప్యాకేజీ అందించడానికి కృషి చేస్తాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, నాలుగు మండలాల తహశీల్దార్లు, నాలుగు మండలాల ఎంపీడీవో లు , ప్రజా ప్రతినిధులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాభూమి గండేపల్లి .



గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో శుక్రవారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా రూ 1లక్ష రూపాయలు రాయితీ పై ఎస్ఎమ్ఏఎమ్ పథకంలో క్రిషీ ట్రాక్టర్ నట్టే వెంకటరమణ అనే రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ దగ్గర చేయడానికి ఈ ప్రభుత్వం క్రుషి చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు, ఎంపీడీవో నాతి బుజ్జి, సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, కాటేపల్లి భద్రరావు,తెలగరెడ్డి భద్రరావు దిడ్డి చిన్న శ్రీను, కొల్లి త్రిమూర్తులు, రామకుర్తి నరసింహ, తణుకు దుర్గారావు, దార్లంక నూకరాజు చింతపల్లి భద్రం, బలిరెడ్డి గణేష్ ,మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి, ఏఈఓ చంద్రమౌళి, విహెచ్ఏ కనకయ్య, విఏఏ అలీషా పాల్గొన్నారు.

ప్రజాభూమి



## పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతికి నిరసనగా శాంతి ర్యాలీ



ప్రజభూమి కోటనందూరు

కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతికి నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు మండలంలోని పాస్టర్స్ మరియు సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. స్థానిక సింహాద్రి కాలనీ నుండి పోలీస్ స్టేషన్ వరకు శాంతి ర్యాలీ కొనసాగింది. బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి అనుమానాస్పదంగా ఉందని, దీనిపై రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ జరిపించి నిజానిజాలు క్రైస్తవ లోకానికి తెలియజేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోటనందూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బి సంతోష్ కుమార్, సెక్రెటరీ ఎబినేజర్, ట్రెజరర్ ఆర్ బర్నబాస్, స్థానిక సంఘ కాపరులు జి గాబ్రియల్, పి డెవిడ్ లివింగ్ స్టన్, వంకల ప్రసాద్, పి మధు, జి ఏసుదాసు, సిబియం చర్చ్ కమిటీ సభ్యులు, ఫీల్డ్ కౌన్సిల్ సెక్రటరీ ఎన్ జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరు మదర్ థెరిసా ప్రింటర్స్‌కు దక్కిన టెండర్



ప్రజాభూమి అమలాపురం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథక నిర్వహణలోఅత్యంత అవసరమయ్యే స్టేషనరీ ప్రింటింగ్ సరఫరా టెండర్ కొవ్వూరు మదర్ థెరిసా ప్రింటర్స్ కు దక్కిందని అంబెద్కర్ కోనసీమ జిల్లా పర్చేజింగ్ కమిటి అధ్య క్షులు జాయింట్ కలెక్టర్ టి నిశాంతి తెలిపారు. ఎం బుక్స్, మస్టర్ సీడ్స్ డిమాండ్ బ్లూ ఫారమ్స్, శ్రమ శక్తి సంఘాల రిజి స్ట్రేషన్ పారాలు, ఫండ్స్ ట్రాన్స్ ఫర్‌ఆర్డర్ రిజిస్టర్లు, ఇతర రకాల ఏడు రిజిస్ట ర్లు ప్రింటింగ్ చేసి ఏడాది పాటు సరఫరా చేయ డానికి గాను సీల్ టెండర్లు కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు షీల్డ్ టెండర్ బాక్స్ ను ఆమె ఓపెన్ చేశారు, దీనిలో నలుగురు ప్రింటర్స్ తమ తమ నామినేషన్లు దాఖలు చేయగా మూడు నామినేషన్లు అర్హత పొం దగా మదర్ తే రిసా ప్రింటర్స్ కొవ్వూరు వారు అతి తక్కువ రేట్లు కోడ్ చేయగా వారికి టెండర్ ఖరారు చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ ప్రకటించారు ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ జిల్లా నీటి యా జమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్ మధుసూదన్, సభ్యులు పంచాయతీరాజ్ ఎస్. ఇ పి రామకృష్ణారెడ్డి, గ్రామీణ అభివృద్ధి సంస్థ పిడి సాయినాథ్ జై చంద్ర గాంధీ, పాల్గొన్నారు.

## సుబ్బయ్యమ్మపేటలో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించిన జ్యోతుల నెహ్రూ



ప్రజాభూమి జగ్గంపేట

గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మ పేట గ్రామంలో 40 లక్షల రూపాయలతో తారు రోడ్డు, 20 లక్షల రూపాయలతో ఇంటర్నల్ సిసి రోడ్లు 16 లక్షల రూపాయలతో గ్రామంలో సిసి రోడ్లు ను పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులు, తెలుగుదేశం జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు:

## చంద్రబాబు మోసాలలో మరో మైలు రాయి

### -వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పలివెల నాగేంద్రరాజు



ప్రజా భూమి ప్రత్తిపాడు,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మోసాలు మరో మైలురాయిని చేరాయని వైయస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షులు నాగేంద్ర రాజు పలివెల ఆరోపించారు.'రాష్ట్రంలో ట్యాక్స్ ఎంతమంది కడుతున్నారో చంద్రబాబుకు తెలుసా? కొత్తగా పీ4 అనే మోసా నికి తెరతీశాడని ఆయన విమర్శించారు .ఎన్నికల్లో కూటమి పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల్ని ఎందుకు అమలుచేయడం లేదంటే వైసిపి మీద బడద జల్లి అప్పులున్నాయని కుంటు సాకులు చెప్పడానికే అని ఆరోపించారు. అంతేకాక రాష్ట్రం వైసీపీ పాలనలో అప్పు రూ.6.5 లక్షల కోట్లు ఉందని బడ్జెట్లో ముఖ్యమంత్రి తెలియజేసినట్లు చెప్పారు . అందులో రూ.3.13 లక్షల కోట్లు 2019లో ఆయన ప్రభుత్వం దిగిపోయేనాటికి ఉన్నవే అని గుర్తుంచుకోవాలని,హామీల్ని ఎగవేసేందుకే మరో మారు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆక్షేపించారు

## గ్రామాల అభివృద్ధి దేశ అభివృద్ధి. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు

### తూర్పు లక్ష్మీపురం గ్రామంలోపలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ గొల్లపల్లి





ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని వాటిని అభివృద్ధి చేస్తేనే దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతు న్నాయని ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి అన్నారు ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామపంచాయితీ పరిధిలోఅయన గొల్లపల్లి బుజ్జి చేతుల మీదుగా మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నూతన సంవత్సర పనులు భూమి తో పాటు పశువుల నీటి తొట్టెలు శంఖు స్థాపన పనులు ప్రారంభోత్సవం శుక్రవారం చేసారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వారు, గ్రామ ఉప సర్పంచ్ బూరెల బాస్ ,వార్డు సభ్యులు బృహత్ , శ్రీనివాస్ , గ్రామ నాయకులు గంగిశెట్టి సత్యనారాయణ వీరంరెడ్డి తాతబాబు ,సచివాలయం ఫంక్షనల్ అసిస్టెంట్స్, ఉపాధి హామీ మేట్స్ ఇతరులు పాల్గొన్నారు

## ఆదిత్య లో అంతర్జాతీయ సదస్సు



ప్రజా భూమి గండేపల్లి

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగములో ఇంజనీరింగ్ అనువర్తనాల అల్గారిథమ్‌లు మరియు గణన సిద్ధాంతం అనే అంశం మీద ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఘనంగా మొదలైంది. వివిధ దేశాలకు మరియు రాష్ట్రాలకు చెందిన అనేక మంది అభ్యర్థులు ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. మొదటి రోజు ఉదయం సదస్సు లో ఐ.ఐ.ఐ.టీ హైదరాబాద్ లో ఈమెరిటస్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న టువంటి డా. బి. యజ్ఞనారాయణ,ది యూనివర్సిటీ ఆఫ్ న్యూకేసిల్ ఆస్ట్రేలియా లో విజిటింగ్ ప్రొఫెసర్ డా.ఆసాది శ్రీనివాసులుముఖ్య అతిథులుగా ప్రసంగించారు.

## పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పండుగ

- నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన శాసన మండలి సభ్యులు నాగబాబు
- గొల్లప్రోలు తాగునీటి సరఫరా కేంద్రంలో పూర్తయిన అభివృద్ధి పనులు
- గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ ప్రారంభం



ప్రజా భూమి ప్రతినిధి పిఠాపురం

కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం కోలాహలంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనపై ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టి సారించారు. పవన్ కళ్యాణ్ చొరవతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా శాసన మండలి సభ్యుడు కొణిదల నాగబాబు పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అందులో భాగంగా రూ.28.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన గొల్లప్రోలు మండల నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ తో కలసి ప్రారంభించారు. అనంతరం గొల్లప్రోలు హెడ్ వాటర్ వర్క్స్ లో రూ. 65.24 లక్షలతో మంచినీటి సరఫరా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పంప్ హౌస్ లో మోటార్ల పని తీరుని పరిశీలించారు. అనంతరం గొల్లప్రోలు పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్ ని ప్రారంభించారు. క్యాంటిన్ లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. నాగబాబుతో పాటు ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పార్టీ పిఠాపురం నియోజక వర్గం సమన్వయకర్త



మర్రెడ్డి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

### నాగబాబుకి జనసేన శ్రేణుల ఘనస్వాగతం

శాసన మండలి సభ్యులుగా పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన కొణిదల నాగబాబుకి నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. పిఠాపురం, గొల్లప్రోలు మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా బాణసంచా పేలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ, జేజేలు పలుకుతూ స్వాగతం పలికారు.

## ఆహ్లాదకరంగా పల్లె పండుగ కార్యక్రమం

### -2 కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైన్ లు ప్రారంభించినఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ






ప్రజా భూమి గండేపల్లి .

గండేపల్లి మండలం మురారి గ్రామంలో కూటమి ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని పండగ వాతావరణం లో మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై 1కోటి యాభై లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు సిసి డ్రైన్లు,ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్, కందుల కొండయ్య దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తమ స్కూల్ కి రోడ్లు వేయించినందుకు ఎమ్మెల్యే నెహ్రూకు స్కూల్ విద్యార్థిని విద్యార్థులు థాంక్యూ ఎమ్మెల్యే సార్ అనే పే కార్డులతో ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ అధికారులందరినీ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలోనే 25 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో మొదటి విడతగా మిగిలి ఉన్న సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందని అదేవిధంగా నియోజకవర్గం లోని బీటీ రోడ్లు కూడా నిర్మాణం జరుగుతున్నాయని రెండో సంవత్సరంలో సిమెంట్ డ్రైన్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గండేపల్లి లో 30 లక్షలు రూపాయలతో సిసి రోడ్లు, మల్లేపల్లి లో 40 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, సుబ్బయ్య పేటలో 10 లక్షల రూపాయలతో సిసి రోడ్లు శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, జాస్తి వసంత్, సుంకవిల్లిరాజు, బొల్లం రెడ్డి రామకృష్ణ, సుంకవిల్లి రమేష్,కురుకూరి చౌదరి, బలిరెడ్డి గంగరాజు, తెలగ రెడ్డి భద్రరావు, కొల్లి త్రిమూర్తులు,దిడ్డి చిన్న శ్రీను, రామకుర్తి నరసింహ,బోండా శ్రీనుబాబు,గొల్లవిల్లి అప్పలరాజు, సింగలూరి రాందీప్, పంచాయతీరాజ్ డిఈ ఉమా శంకర్,జేఇ నారాయణమూర్తి, ఎంపీడీవో నాతి బుజ్జి, ఎమ్మార్వో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన టిడిపి శ్రేణులు




ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాలతో సి రాయవరం రమణయ్య పేట లో రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక టీడీపి నాయకులు పలివెల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు,ఈ రబీ సీజన్లో రైతులకు ఆర్ యస్ కే సిబ్బంది అందుబాటులో ఉండాలనిఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ పలివెల శ్రీనివాస్, ధాన్యం కొనుగోలు సిబ్బంది, ఎంపీఈఓ వీఆర్వో, అగ్రికల్చర్అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు,

## మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం





ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలం నందు రబీ సీజన్ 2024-25 కు గాను 16 రైతు సేవా కేంద్రాలకు సంబంధించిన 8 క్లస్టర్లలో శాసన సభ్యులు వరుపుల సత్యప్రభ రాజా ఆదేశాల మేరకు మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) ఆధ్వర్యం లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడం శు క్రవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి మాట్లాడుతూరబీ సీజన్ లో కనీస మద్దతు ధర సాధారణ రకానికి(ఎం టి యు 1121) 100 కేజీలకు - 2300 రూపాయలు 75 కేజీలకు - 1725 రూపాయలు గ్రేడ్ -A రకానికి (ఎం టి యు -1156,ఆర్ ఎన్ ఆర్ -150428) 100 కేజీలకు - 2320రూపాయలు 75 కేజీలకు - 1740 రూపాయలు తేమ శాతం 17శాతం లోపు ఉండేలా ఆరబెట్టాలి అని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలోని ఎర్రవరం లింగంపర్తి పెద్దనాపల్లి తూర్పు లక్ష్మీపురం భద్రవరం పేరవరం సిరిపురం ఏలేశ్వరం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఏలేశ్వరం మండల వ్యవసాయ శాఖ అధికారిని బి జ్యోతి ఈ సందర్భంగా పేర్కొన్నారు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బందిని వినియోగించుకుని కేవలం రెండు రోజులలో కనీస మద్దతు ధర పొందగలరని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూతి బూరయ్య జ్యోతుల పెద్దబాబు మండల తహశీల్దార్ టి.ఆనంద్ కుమార్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు,గ్రామ కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్ర ఇంచార్జ్ లు, సొసైటీ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బంది మరియు అధిక మొత్తంలో రైతులు పాల్గొనడం జరిగింది.

## అమలాపురంలోలిరెండు నిండు ప్రాణాలు బలి

ప్రజాభూమి అమలాపురం

అతి వేగం, నిర్లక్ష్యం కారణంగా వచ్చిన లారీ అన్నదమ్ముల నిండుప్రాణాలను బలికున్న సంఘటన శుక్రవారం అమలాపురం లో జరిగింది.. అన్నయ్య దిన కార్యక్రమాన్ని ముగించేం దుకు స్కూటీపై కౌశికకు వెళుతున్న అన్నదమ్ముల ఇద్దరిని లారీ ఢీ కొట్టింది. వీరిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా తమ్ముడైన మంగిపూడి నాగరాజు(64) మార్గమధ్యంలో. మృతి చెందగా, అన్న మంగిపూడి రామచంద్ర రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం . గంగలకుర్రులో గత నెల 24న మృతుల సోదరుడైన మంగిపూడి సూర్యనారాయణ మృతి చెందాడు. సూర్యనారాయణ దశ దిన కార్యక్రమాన్ని మంగిపూడి రామచంద్ర రావు, నాగరాజుల ఇంటి వద్ద శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు రామచంద్రరావు,నాగరాజులు స్కూటిపై స్థానికంగా ఉన్న కౌశకకు వెళు తున్నారు. గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న నాలుగు రోడ్ల సెంటర్ వద్దకు వచ్చే సరికి ముక్కామల నుండి అంబాజీపేట వైపు వెళుతున్న టిప్పర్ లారీ వీరిరిరువురిని బలంగా ఢీ కొట్టింది. దాంతో నాగరాజు, రామచంద్రరావులను 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో నాగరాజు మృతి చెందగా, రామచంద్రరావు మృత్యువుతో పోరాడుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.రామచంద్ర రావు అవివాహితుడు కాగా,నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. సంఘటనా స్థలం నుండి లారీ డ్రైవర్ పరారయ్యి పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడని ఎస్సై తెలిపారు. . అప్పటి వరకు అన్నగారి దిన కార్యక్రమాన్ని పూర్తి చేసిన సోదరులిద్దరూ మృతువాత పడటంతో బంధువులు, స్థానికులు రోధిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. ఆ గ్రామంలో విశాద చాయలు నెలకున్నాయి.



## ఆర్ట్ ఫెస్టివల్ అద్భుతం : వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ



ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో నిర్వహించిన "అమరావతి చిత్రకళా వీధి - ఆంధ్రస్ మోస్ట్ వైబ్రంట్ ఆర్ట్ ఫెస్టివల్" కు విశేష స్పందన వచ్చిందని, అద్భుతమైన కళారూపాలు ప్రదర్శింపబడ్డాయని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ అన్నారు. శుక్రవారం అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరైన వీసీ చిత్రకళా ప్రదర్శనలను సందర్శించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు ఎంతో నైపుణ్యంతో గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం కేంద్రకారాగారం వారు ఏర్పాటు చేసిన స్టాల్ ను సందర్శించి ఖైదీల సైతం ఎంతో నైపుణ్యంతో చిత్రలేఖనాలను వేయడం విశేషం అన్నారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృత శాఖ నిర్వహకులను అభినందించారు. యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్. విభాగం నుండి సహకారం అందించిన 120 మంది వాలంటీర్లను అభినందించారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశ్వవిద్యాలయం నుండి 38 మంది కళాకారులు, వివిధ ఆర్ట్స్ ను ప్రదర్శించేందుకు 12 మంది కళాకారులు, హస్తకళలను ప్రదర్శించేందుకు ఏడుగురు విశ్వవిద్యాలయం నుండి హాజరయ్యారని విద్యార్థులందరిని అభినందించారు.

కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు మంత్రి కందులు దుర్గేష్ వీసీ ప్రసన్న శ్రీ కి జ్ఞాపకం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.ఆర్.వో. ఆనంద్, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.పి.వెంకటేశ్వరరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఎం.గోపాలకృష్ణ, ఎ.ఎం.శిరీషా, ఎల్.సుజాత, ఎస్.రాజ్యలక్ష్మీ, ఎల్.ముత్యాలనాయుడు, కె.రాజరాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# పార్టీ బలోపేతానికి కృషి చేయండి

## - వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాభూమి, అనంతపురము



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నూతనంగా నియమితులైన పెన్నార్ల విభాగం నగర అధ్యక్షులు తలారి వెంకటేశులు, పెన్నార్ల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ లకు వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైయస్సార్ సీపీ కార్యకర్తలపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని, కూటమి నేతలు సాగిస్తున్న అరాచక పాలనపై ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు తప్పకుండా ఉంటుందన్నారు.

# దాహార్తి తీర్చడం అభినందనీయం

## - మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్




వేసవి కాలంలో ప్రజల దాహార్తికిచ్చేందుకు సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఏర్పాటు చేయనున్న చలివేంద్రాలను పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా పట్టణంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛమైన శుద్ధ నీటిని అందించేందుకు యోగి నారాయణ సేవా సమితి కృషి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. మధ్యాహ్నవేళలో ప్రజల ఆకలిని తీర్చేందుకు ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించడంతోపాటు ఇలా దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఇందులో భాగంగా శుక్రవారం మూడు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయగా మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ డిఈ రమేష్ కుమార్, పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద ఇన్స్పెక్టర్, మరో చలివేంద్రాన్ని డాక్టర్ వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సద్గురు యోగి నారాయణ సేవాసమితి అధ్యక్షులు రవిశంకర్, సమితి ప్రతినిధులు రాజ్యలక్ష్మి మోహన్, దుర్గా నవీన్, నిమ్మకాయల రాము, వెంకటరామప్ప, నాగరాజు, మంజు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించన జిల్లా అధ్యక్షుడు ఏ వన్నూరప్ప

ప్రజాభూమి బ్యూరో, అనంతపురం



అనంతపురం నగరంలో బిసి స్టడీ సర్కిల్ కార్యాలయము నందు సమాచార హక్కు చట్టంపై అవగాహన గూర్చి వివరిస్తున్న జిల్లా అధ్యక్షుడు హెన్నూరప్ప. శుక్రవారం బీసీ వెల్ఫేర్ శాఖకు జిల్లా అధికారి కోరిక మేరకు అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం నందు సమాచార హక్కు చట్టంపై బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు వివరంగా తెలియజేశారు. బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు సమాచారం చట్టంపై అవగాహన కార్యక్రమం తర్వాత జిల్లా అధ్యక్షుడికి ఏ వన్నూరప్పకు చిరు సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూ కొఠారి, ఈడి మస్తాన్ వలి, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆక్రమణల తొలగించేందుకు సిద్ధమైన అధికారులు

## -ప్రత్యామ్నాయం చూపించాలన్న స్థానికులు-మద్దతుగా నిలిచిన వైకాపా నేత

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని నంది సర్కిల్ లో ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించడానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రమ్మ, టీపీఎస్ అలివేలమ్మ లు యంత్రాలతో పాటు వారి సిబ్బందితో కలిసి ఆక్రమణలు తొలగించడానికి అక్కడికి వెళ్లారు. దీనిని అక్కడ ఉన్న వారితో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ సంఘం నాయకులు, ఇతర యూనియన్ నాయకులు కలిసి అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ సంఘం గౌరవ అధ్యక్షులు, వైకాపా నాయకులు వేణుగోపాల్ రెడ్డి అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా నిలిచారు. ఈ విషయంలో ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా పేదలు చిన్న చిన్న బంకులను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, అదే విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ సంఘం తమ కార్యాలయాన్ని, ఇతర సంఘాలు కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఆయా వాటిని ఏర్పాటు చేసుకునే సమయంలో ఏ ఒక్కరూ కూడా అడ్డు చెప్పలేదని, . ఈ స్థలం సైతం రోడ్డుకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. రైల్వే రోడ్డు విస్తరణ పేరుతో భవనాలను తొలగించి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు అక్కడ రోడ్డు వేయలేకపోయారని, తాజాగా ఎవరికి ఇబ్బంది లేనటువంటి ప్రాంతంలో చిన్న, చిన్న వ్యాపారులు బంకులను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంటే ఆక్రమణల పేరుతో తొలగించడం అన్యాయం అన్నారు. ఇక్కడ ఉన్న ఆక్రమణలు తొలగించి ఈ స్థలాన్ని ఎవరికి కట్టబెట్టాలని చూస్తున్నారని అధికారులపై ఆయన తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ స్థలం పురపాలక సంఘానికి చెందినదే, అయితే తాము స్వచ్ఛందంగా ఇక్కడ ఉన్న బంకులను, యూనియన్ కార్యాలయాలను తొలగించుకుంటామని, అయితే మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. లేనిపక్షంలో ఇక్కడి నుంచి తాము కదిలే ప్రసక్తే లేదని అధికారులతో వాదించారు. చివరకు ఈ విషయంలో తామే కార్యాలయంకు వచ్చి చర్చిస్తామని చెప్పడంతో మున్సిపల్ అధికార యంత్రాంగం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.



# ముస్లిం మనోభావాలను దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం -ప్రధాని, ముఖ్యమంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు

## -రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టడంపై వైకాపా నిరసన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయాలన్న దురుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణకు పూనుకోవడం తగదని వైకాపా నాయకులు విమర్శించారు.







వక్ఫ్ బోర్డు బిల్లు సవరణపై ముస్లిం మైనార్టీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా హిందూపురం పట్టణంలో శుక్రవారం వైకాపా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు,ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలు నమాజ్ అనంతరం హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కి భారీగా చేరుకొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న వక్ఫ్ బోర్డు ముస్లిం మైనార్టీలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందన్నారు. అలాంటి వక్ఫ్ బోర్డు పై కేంద్ర ప్రభుత్వం కన్నేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఉద్దేశంతో పార్లమెంట్, రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టడం సమంజసం కాదన్నారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చి మైనార్టీలను అణచి వేసే కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ముస్లింల మనోభావాలు దెబ్బతీయడమే మోడీ అజెండా అని, పార్లమెంట్ ముందుకు సవరణ బిల్లు రావడం అంటే దేశానికి బ్లాక్ డే అన్నారు. దేశ చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయే చర్య అన్నారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడం కోసమే ఈ పన్నాగమని, సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశంలో 25 కోట్ల మంది ముస్లింలు ఆందోళనలు చేస్తున్నా మోడీ పట్టించుకోలేదని విమర్శించారు. ముస్లిం మైనారిటీల భద్రతా, మనోభావాలు, వారి ఆస్తులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున ఆ బిల్లును వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు ముస్లిం మైనార్టీల మనోభావాలు దెబ్బ తినే విధంగా ఉందని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మద్దతు పలకడం శోచనీయమని, ముస్లిం మైనారిటీలు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అంబేద్కర్ సర్కిల్ నుండి సద్భావన సర్కిల్ మీదుగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు, తహశీల్దార్ కార్యాలయం వద్ద ముస్లిం మైనార్టీలు బైఠాయించి ప్రధాని మోదీ డౌన్ డౌన్, సీఎం చంద్రబాబు నాయుడు డౌన్ డౌన్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు, అనంతరం ముస్లిం మైనార్టీల బాగుండే విధంగా బిల్లు వెనక్కి తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు, ముస్లిం మైనార్టీల ర్యాలీకు స్థానిక వైఎస్ఆర్సీపి నాయకులు మద్దతు పలికారు, స్థానిక వైసీపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి , ముస్లిం కౌన్సిలర్లు తదితరులు భారీ ఎత్తున పాల్గొని మద్దతు పలికారు.

# నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వీ.

ప్రజాభూమి బ్యూరో, అనంతపురము





చుక్కల భూముల (డాటేడ్ ల్యాండ్స్) సమస్యల పరిష్కారానికి శీఘ్రగతిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్. వీ. సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురము కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం అనంతపురము రెవిన్యూ డివిజన్ కు సంబంధించి జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ, డిఎల్సి, డిఎల్ఎన్సి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ ను తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వస్తున్న అర్జీలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతివారం షెడ్యూల్ చేసుకుని జిల్లాస్థాయి డాటెడ్ ల్యాండ్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో "22-ఏ"కు సంబంధించి బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం మండలాలకు చెందిన 6 కేసులను విచారించగా, అందులో 5 కేసులను ఆమోదించడం జరిగిందని, 1 కేసును తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. డాటెడ్ ల్యాండ్స్ కు విషయంలో బుక్కరాయసముద్రం మండలానికి సంబంధించిన 2 కేసులకు సంబంధించి విచారించగా, రెండింటినీ ఆమోదించడం జరిగింది. అలాగే రాయదుర్గం మున్సిపాలిటీకి సంబంధించి డిఎల్ఎన్సి (డిస్ట్రిక్ లెవెల్ నెగోషియేషన్) నిర్వహించి ఒక ఎకరా రూ.43 లక్షలకు నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసీల్దార్ లు పుణ్యవతి, మహబూబ్ భాష, భాస్కర్, నాగరాజు, కలెక్టరేట్ ఈ సెక్షన్ డిటి ప్రభంజన్ రెడ్డి, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం -అంతర్జాతీయ ప్రమాణాల సౌకర్యాలు ఏర్పాటు

## -గ్రాడ్యుయేషన్ డే లో పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్




పోటీ ప్రపంచంలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని స్థానిక పాంచజన్య బ్రిలియంట్స్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, అకాడమిక్ డైరెక్టర్ నందిత పేర్కొన్నారు. పాంచజన్య పాఠశాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులకు సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజి పూర్తి చేసుకుని, ప్రైమరీ విద్యకు నాంది పలుకుతున్న సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, అకాడమిక్ డైరెక్ట ర్ నందిత, కరస్పాండెంట్ నందకుమార్ మార్కుల మెమోతో పాటు పట్టా, మిఠాయి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటికే పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయికి అనుగుణంగా ప్రమాణాలను ఏర్పాటు చేసి, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. దీని కోసం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన వివిధ పాఠశాలలను పరిశీలన చేసి ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాల కన్నా ఇంకా మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తామన్నారు. విద్యకు పునాది ప్రాథమిక విద్య అన్నారు. ప్రాథమిక విద్య దశలో మంచి క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించడంతో విద్యార్థి ఉన్నత విద్యకు పోయే సమయానికి మంచి క్రమశిక్షణతో ముందుకు పోవడానికి సాధ్యమవుతుందన్నారు. అందుకోసమే ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. గాయత్రి, ఏఓ భాస్కర్, పాఠశాల సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, అబ్దుల్ రజాక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధాకలితో ఎంజీఎం విద్యార్థులు..!!!-ముందొస్తేనే గుడ్డు

## -నాణ్యతలేని భోజనంతో విద్యార్థుల అవస్థలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్





ఆ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది. జాతిపిత మహాత్మా గాంధీ నాడు స్వాతంత్ర ఉద్యమంలో స్వాతంత్ర ఉద్యమస్ఫూర్తిని ఈ ప్రాంత ప్రజల్లో నింపడానికి ఆ పాఠశాలలో వేదికగా నిలిచింది. అలాంటి స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర కలిగిన మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం నిర్లక్ష్యం, స్వార్థం వల్ల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో 648 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి రోజు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉంది. అయితే శుక్రవారం నిర్లక్ష్యం వల్ల ఒక గంట పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఆలస్యంగా ఇచ్చారు. విద్యార్థులు ఉదయం లేచి కాలకృత్యములు పూర్తి చేసుకుని, మంచి నీళ్లు తాగి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఇస్తారన్న నమ్మకంతో ఉదయం 7.45 గంటలకు పాఠశాల వచ్చారు. అయితే సకాలంలో భోజనం అందించకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించిపోయారు. ఈ విషయమై మధ్యాహ్న భోజనం వండే వ్యక్తితో ఎందుకు ఇంత ఆలస్యంగా విద్యార్థులకు అన్నం పెడుతున్నారని అడిగితే హెచ్ఎం తమకు బియ్యం ఆలస్యంగా అందించారని, దీంతో వండటం ఆలస్యం అయిందని సమాధానమిచ్చాడు. 50 కిలోల బియ్యం ఇచ్చి మూడు రోజులు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అందరికి ఎలా అన్నం వడ్డించాలో అర్థం కావడం లేదన్నారు. పాఠశాల లెక్కల ప్రకారం 648 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో పదవ తరగతి విద్యార్థులు 180 మంది పరీక్షలు రాసి వెళ్ళిపోయారు. మిగిలిన 480 మందిలోనూ ఇంకా 180 మంది రాలేదనుకున్నా 300 మంది ఉంటారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక విద్యార్థి 150 గ్రాముల చొప్పున అన్నం వండాల్సి ఉంది. అయితే పాఠశాల హెచ్ఎం ఇచ్చిన బియ్యం మేరకు 160 మంది విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనం సిద్ధం చేశారు. పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం ప్రత్యేక మెనూ సిద్ధం చేసి అన్నంతో పాటు కోడిగుడ్లు, చెక్కీలతో పాటు రాగి జావ ఇవ్వాల్సి ఉంది. వీటిని సైతం పూర్తిగా ఇవ్వడం లేదు. కనీసం 300 మంది విద్యార్థులకు కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉంటే 10 క్రేట్ల కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 5 నుంచి 6 క్రేట్లే ఇస్తున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. దీనిని బట్టీ ఎవరు ముందు వస్తే వారికి గుడ్డు అందుతుందన్న మాట. ప్రభుత్వం నుంచి ఇండెంట్ ప్రకారం బియ్యం, గుడ్లు అందుతున్నా విద్యార్థులకు అందించడంలో ఉదాశీనత ప్రదర్శిస్తున్నట్లు బహిర్గతమవుతోంది. ప్రతి నెల పనిదినాలు 24 రోజులు లెక్క వేసుకున్నా నెలకు దాదాపు 20 పాకెట్ల బియ్యం వినియోగించాలి. అయితే హెచ్ఎం లెక్క ప్రకారం 8 పాకెట్ల బియ్యం మాత్రమే వినియోగిస్తున్నారు. మిగిలిన బియ్యం ఎవరూ తీసుకెళుతున్నారు అన్నది అర్థం కావడం లేదు. ఈ విషయంపై హెచ్ ఎం. సామ్రాజ్యం కు మాట్లాడితే జిల్లా ఉప విద్యాధికారి మధ్యాహ్నం 12 గంటలకు భోజనం ఇవ్వాలని చెప్పినట్లు చెబుతున్నారు. ఒక విద్యార్థికి ఎన్ని గ్రాములు ఇవ్వాలని అడిగితే చెప్పలేదు. ఏది ఏమైనప్పటికి ఎంతో ఘన చరిత్ర కలిగిన ఎంజిఎం పాఠశాలలో విద్యార్థులు మాత్రం అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ పాఠశాలపై ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు కోరుతున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

# నేటి నుండి శ్రీరామనవమి ఉత్సవాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలో వెలసిన సూగూరు ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం నుండి శ్రీరామనవమి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నర్సింహారాజు, అర్చకులు రాఘవేంద్రరావు, కృష్ణాచార్, వెంకోబారావు తెలిపారు. శనివారం అభిషేకాలు, ప్రాకారోత్సవం, ఆకు పూజ వంటి పూజాది కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా 6వ తేదీ శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం కళ్యాణోత్సవం, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్రం ఉట్ల పరుష, రాత్రి లంక దహనం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే 7వ తేదీ సీతారాముల పట్టాభిషేకం, నిజ అశ్వవాహనం, నగరోత్సవం వంటి పూజలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## రేకలకుంటలో శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణ భూమి పూజ



ప్రజాభూమి:బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీలో శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి ఆలయం వద్ద నూతన ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి నిర్మాణ పూజ కార్యక్రమాన్ని పంచాయతీలోని నాయకులు గ్రామస్తులు భక్తులు నిర్వహించారు. ఈ నూతన ఆలయ నిర్మాణానికి మాలేపాటి సుబ్బారావు, బ్రహ్మంగారిమఠం తెదేపా మండల యువ నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి, వైసిపి నేత కూనపులి రాజశేఖర్ నాయుడు, రామాంజనేయులు, పెరుగు వీరయ్య, వెంకటేష్, గంగన్న, ఓబయ్య, గంగి నాయుడు, బుజ్జి, వెంకటసుబ్బయ్య, పెరుగు నాగేంద్ర, చక్రపాణి నాయుడు, చంద్ర, పుట్టాల శివ యాదవ్, ఓవిల్లా వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



ప్రజాభూమి:బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారి మఠం మండలం రేకులకుంట పంచాయతీలోని డి అగ్రహారం ఎస్సీ కాలనీలో, నీటి కొరత ఉందని. ఎమ్మెల్యే గారి దృష్టి కి వెళ్ళడంతో, ఎమ్మెల్యే గారు జారీ చేసిన ఆదేశాల ప్రకారం. వెంటనే స్పందించి న తెలుగుదేశం పార్టీ మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి స్పందించి, సమస్యను పరిష్కారం చేయటం జరిగింది, తమ సమస్యను పరిష్కరించిన, ఎమ్మెల్యే గారికి,కానాల మల్లికార్జున రెడ్డి గారికి,గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బాస్కర్, నాగయ్య, తదితరులు పాల్గనడం జరిగింది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో నేడు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం కలగనుందని విద్యుత్ ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఈ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ కింద ఉన్న మెయిన్ రోడ్, అంబకపల్లి రోడ్డు , బైపాస్ రోడ్డు, లేఅవుట్ , ఎస్బిఐ కాలనీ, కడప రోడ్లలో శనివారం సాయంత్రం మూడు గంటల నుండి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని కావున వినియో గదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీ మద్దిమాను గురప్ప స్వామి అన్నదాన సత్రంలో హుండీ చోరీ

ప్రజాభూమి పోరుమామిళ్ల:



కడప జిల్లా పోరుమామిళ్ల మండలం శ్రీ మద్దిమాను గురప్ప స్వామి అన్నదాన సత్రంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఈవో నరసయ్య తెలియజేశారు. గురువారం రాత్రి బారి వర్షం పడడంతో అక్కడ ఉన్న వాచ్మెన్ రామసుబ్బయ్య ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించినారు. అన్నదాన సత్రం గేటు తాళం పగలగొట్టి అక్కడున్న హుండీ ఆలయం సమీపంలోని ముళ్లపదల్లో పడవేసి వెళ్లారు. విషయం తెలుసుకొన్న ఈవో నరసయ్య శుక్రవారం ఏఎస్ఐ మూర్తికి కంప్లైంట్ ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు అక్కడ పరిశీలించిన తర్వాత పూర్తి వివరాలు తెలియాల్సిందని తెలియజేశారు.

## పొగాకు రైతులకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యం అంటున్న రైతులు

### నమ్మించి మోసం చేసిందని జిపిఐ కంపెనీ యాజమాన్యం పై తిరగబడ్డ రైతులు






ప్రజాభూమి పోరుమామిళ్ల:

బి. కోడూరు మండలం మునెల్లి పరిసర ప్రాంతాల్లో గురువారం కురిసిన అకాల వర్షానికి పొగాకు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందారు.రైతులను నట్టేట ముంచుతున్న పొగాకు కంపెనీలు గత ఏడాది నుండి గ్రామాలలో తిరుగుతూ ప్రతి రైతును అర్ధ ఎకరా నాటండి మీ ఆదాయం రెట్టింపు చేస్తామని రైతులకు ఆశ చూపిన జిపిఎస్ కంపెనీ యాజమాన్యంరైతులకు గత ఏడాది వచ్చిన లాభాలను చూసుకొని ఈ ఏడాది 600 ఎకరాలలో పొగాకు పంట సాగు చేశారు. సెంటు భూమిలేని రైతులు కూడా పొలాలు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేశారు. ఎకరాకు లక్ష 50,000 రూపాయలు పెట్టుబడితో ఆరు వందల ఎకరాలకు పట్టా సాగు చేయగా కురిసిన ఆకాల వర్షంతో కోట్లు నష్టం వాటిల్లిందని మున్నెల్లి రైతులు వాపోయారు. జిపిఎస్ పొగాకు యాజమాన్యం స్పందించి రైతులకు తగు న్యాయం చేయకపోతే ఆత్మహత్య శరణం అంటూ వాపోయిన రైతులు. బి. కోడూరు మండలంలోని మున్నె ల్లి, తూపల్లె, రాజుపాలెం, టపటవారిపల్లె, బోడిగుండువారిపల్లె గ్రామాల రైతులు 600 నుండి 700 ఎకరాల వరకు పొగాకుపంట సాగు చేశారు. తీరా పంట చేతికిందని ఆశ నిరాశలైందిని రైతులు ఆవేదన చెందారు. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పట్ట మొత్తం నేలకొరగాడంతో కంపెనీ యాజమాన్యం గ్రేడ్ ప్రకారం తీసుకుంటామని చెప్పడంతో రైతులలో ఆవేదన మొదలైంది ఒక ఎకరాకు లక్ష 50,000 రూపాయలు పెట్టుబడి పెట్టి మళ్లీ ఇప్పుడు గ్రేడింగ్ పేరుతో రోజు కూలీలను తీసుకువచ్చి గ్రేడింగ్ చేయాలంటే బారిన నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందారు. మాకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణమని రైతులు రవీంద్రరెడ్డి, అబ్బిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, ఎస్. రామిరెడ్డి, రమాదేవి తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ మేనేజర్ రవికిరణ్ ఈశ్వరయ్యలు మమ్ములను మోసం చేశారంటూ తమ బాధను వేళ్ళబుచ్చారు. శుక్రవారం మున్నిల్లి గ్రామంలో జిపిఎస్ కంపెనీ సిబ్బందిపై రైతులు తమ బాధను వ్యక్తపరుస్తూ న్యాయం జరగకపోతే ఆత్మహత్యలు చేసుకుంటాం అని తిరుగుబాటు చేయడంతో అక్కడి నుండి కంపెనీ సిబ్బంది పరారయ్యారు.

## అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి సహాయాన్ని అందిస్తాం

### టీడీపీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి


ప్రజాభూమి పోరుమామిళ్ల



గురువారం బద్వేల్ నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాల కారణంగా పలు చోట్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీంతో రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కొన్నారని తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ రితేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ధైర్యంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోరే ప్రభుత్వమని, రైతుల కోసం ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందించి వారిని ఆదుకుంటామని తెలిపారు. ఇప్పటికే నష్టంపై అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను సైతం ఆదేశించినట్లు పేర్కొన్నారు. మరియు ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు అచ్చం నాయుడుతో మాట్లాడడం జరిగింది త్వరలోనే రైతులకు న్యాయం చేయాలని కోరడమైనది.

## ఒంటిమిట్ట అభివృద్ధికి సహకరించాలి-కడపజిల్లా టిడిపి అధ్యక్షుడి శ్రీనివాస్ రెడ్డికి వినతి

ప్రజాభూమి ఒంటిమిట్ట



ఒంటిమిట్ట మండల అభివృద్ధికి కడప జిల్లా టిడిపి అధ్యక్షుడు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి నీ ది తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ విజయ శేఖర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ ప్రతినిధులు నల్లగొండ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సుంకేసుల భాష ఎంపీటీసీ ప్రతినిధి చాపల సుబ్బారెడ్డి శుక్రవారం నాడు కడపలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒంటిమిట్ట ఎంపీటీసీలు జిల్లా టిడిపి అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు రాష్ట్ర తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి ఒంటిమిట్ట ఎంపీటీసీలు లు మరియు మండలం నాయకులు కార్యకర్తలు అభిమానులు తో కలిసి తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డప్ప గారి శ్రీను వాసులు రెడ్డి తో కలిసి ఒంటిమిట్ట మండలం అభివృద్ధి లో తెలుగు దేశం పార్టీ ఎంతో కృషి చేస్తున్న విషయం జిల్లా అధ్యక్షుడు రెడ్డప్ప గారి శ్రీను వాసులు రెడ్డి కి తెలియచేశారు. జిల్లా అధ్యక్షుడు గా మీ సహకారం మాకు ఇంకా కావాలి అంటూ పార్టీ కి కృషి చేయడానికి ఒంటిమిట్ట మండలం నాయకులు కార్యకర్తలు అభిమానులు మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాము అని వివరించారు. అదేవిధంగా పార్టీ కార్యకర్తలు కు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మేడా విజయశేఖర్ రెడ్డి తో పాట మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినీ లపై లైంగిక వేధింపులు చేసిన పెంచలయ్య పై ఫోక్సో యాక్ట్ కేసు నమోదు చేయాలి

- ఇలాంటి ఘటనలకు కారణమైన ఏ వి ఆర్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి


ప్రజాభూమి:బ్రహ్మంగారి మఠం




బద్వేలు పట్టణంలోని ఏ వి ఆర్ పాఠశాల ఆరోతరగతి విద్యార్థినీల పై అసభ్యకరంగా ప్రవర్తించిన కంప్యూటర్ ఆపరేటర్ పెంచలయ్య పై కేసు నమోదు చేయాలని, అలాగే పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని శుక్రవారం కడప నగరంలోని డిఇఓ ఆఫీసు నందు ఏవో మునీర్ ఖాన్ గారికి వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాబు రవి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబద్వేలు లో వరుసగా విద్యార్థినులపై లైంగిక దాడులు జరుగుతున్న కనీసం యాజమాన్లు వారిపై చర్యలు తీసుకోకుండా ప్రవర్తించడం దారుణం. విద్యార్థులకు మంచి నైపుణ్యం, చదువు చెప్పాల్సినటువంటి వారే నేడు విద్యార్థినిలపై లైంగిక దాడులు చేయడం ఘోరమైన పరిస్థితి బద్వేలు లో కనపడతా ఉంది. ఇలాంటి సంఘటనలు జరిగితే రాబోవు రోజుల్లో విద్యార్థులు చదువుకు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి విద్యార్థులపై లైంగిక దాడి చేసిన పోక్సో యాక్ట్ కేసు నమోదు చేయాలని. అలాగే ఏ వి ఆర్ గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని. వారన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కడప నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 5న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- ఏప్రిల్ 6న ధ్వజారోహణం
- ఏప్రిల్ 6, 7వ తేదీలలో కవి సమ్మేళనం







ప్రజాభూమి ఒంటిమిట్ట:

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుండి 14వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 5న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, ఎండవేడిని తట్టుకునేలా చలువపందిళ్లు ఏర్పాటుచేశారు. ఆలయ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయ గోపురాలు, కల్యాణవేదిక, ఇతర ప్రాంతాల్లో పుష్పాలంకరణలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, విద్యుత్ కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేశారు.

**ఏప్రిల్ 6న ధ్వజారోహణము**

ఏప్రిల్ 6న ధ్వజారోహణంతో శ్రీ కోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం, రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవ జరుగనున్నాయి .బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6న శ్రీ రామనవమి, ఏప్రిల్ 9న హనుమత్సేవ, ఏప్రిల్ 10న గరుడసేవ జరగనున్నాయి. ఏప్రిల్ 11న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరుగ నుంది. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. ఏప్రిల్ 12న రథోత్సవం నిర్వహిస్తారు. ఏప్రిల్ 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియను న్నాయి. ఏప్రిల్ 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

**కవి సమ్మేళనం** :శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం, శ్రీ పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీ సాయంత్రం 4 నుండి రాత్రి 7 గంటల వరకు పోతన భాగవతం అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 7వ తేదీ రామయాణంలోని కాండలపై కవి సమ్మేళనం జరుగుతుంది.

### ఆలయ చరిత్ర

ఈ ఆలయానికి పురాతన, చారిత్రక ప్రాశస్త్యం ఉంది. ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తులు ఉండడం వల్ల ఒంటిమిట్టను ఏకశిలానగరం అని కూడా అంటారు. పురాణాల ప్రకారం ఆలయ చరిత్ర ఇలా ఉంది. శ్రీమహావిష్ణువు త్రేతాయుగంలో శ్రీరామచంద్రు నిగా అవతరించాడు. సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యంలో సంచరిస్తుండగా సీతాదేవి దప్పిక తీర్చేందుకు భూమిలోనికి బాణం వేయగా నీరు బుగ్గ పుట్టింది. అదే ఒంటిమిట్ట రామతీర్థం అయింది. సీతాన్వేషణ కోసం జాంబవంతుడు సహకరించాడు. ఆ జాంబవంతుడు సేవించిన సీతాలక్ష్మణ సమేత శ్రీ రామచంద్రుడే ఒంటిమిట్ట గుడిలో కొలువై ఉన్నాడు.

**శాసనాల ప్రకారం :**

ఈ ఆలయాన్ని మూడు దశల్లో నిర్మించారని, 14వ శతాబ్దంలో నిర్మాణం ప్రారంభమై 17వ శతాబ్దంలో పూర్తయిందని ఇక్కడున్న శాసనాల ద్వారా తెలుస్తోంది. ఉదయగిరిని పాలించిన కంపరాయలు ఈ ప్రాంతంలో ఒకసారి సంచరిస్తాడు. వేట మీద జీవనం సాగించే వంటడు, మిట్టడు ఇక్కడికొచ్చిన కంపరాయలకు, ఆయన పరివారానికి శ్రీరాముడు సృష్టించిన బుగ్గనీటితో దప్పిక తీరుస్తారు. వీరిరువురి కోరికపై కంపరాయలు ఆలయాన్ని నిర్మించి ఒంటిమిట్ట గ్రామాన్ని ఏర్పాటుచేస్తాడు. క్రీ.శ 1356లో బుక్కరాయలు ఈ ఆలయాన్ని ప్రారంభించాడు. ఆ తరువాత కాలంలో విజయనగరరాజులు, మట్లిరాజులు క్రమంగా గుడికి అంతరాళం, రంగమండపం, మహాప్రాంగణం, గోపురం, రథం నిర్మించారు. ఒంటిమిట్ట చుట్టుపక్కల గ్రామాల రాబడిని ఆలయ కైంకర్యాలకు వినియోగించారు. వావిలికొలను సుబ్బారావు భిక్షాటన చేసి విరాళాలు సేకరించి ఆలయానికి పూర్వ వైభవం తెచ్చారు.

**రాములవారిపై సాహిత్యం :**


ఎందరో మహాకవులు తన సాహిత్యం ద్వారా శ్రీరామచంద్రుని కరుణకు పాత్రులయ్యారు. పోతన ఇక్కడే భాగవతాన్ని అనువదించినట్టు తెలుస్తోంది. అయ్యలరాజు తిప్పయ్య ఒంటిమిట్ట రఘువీర శతకం చెప్పారు. రామభద్రుడు 'రామాభ్యుదయం' రచించారు. నల్లకాల్వ అయ్యప్ప ఒంటిమిట్ట రాముని వరం పొంది వరకవి అయ్యారు. ఉప్పు గొందూరు వేంకటకవి ఒంటిమిట్ట రశరథరామ శతకం చెప్పారు. వావిలికొలను సుబ్బారావు ఆంధ్రవాల్మీకి రామాయణాన్ని మందర వ్యాఖ్యతో రచించారు. తాళ్లపాక అన్నమయ్య రామునిపై పలు సంకీర్తనలు ఆలపించారు


## అకాల వర్షాలు నేలకొరిగిన అరటి తోటలు, వడగండ్లు, గాలులతో కూడిన వర్షలకు అరటి అతలాకుతలం,

లక్షలాది రూపాయలు నష్టంలబో దిబోమంటున్న రైతన్నలు,

అదికారులు పంటతోటలు పరిశీలించి తగు నష్ట పరిహారం చెల్లిచాలని వేడుకొంటున్నరైతులు,

ప్రజాభూమి పోరుమామిళ్ల:





గురువారం రాత్రి కురిసిన అకాల వడగండ్లు గాలులతో కూడిన వర్షాలకు వందలాది ఎకరాలలో అరటి తోటలు నేలమట్టమయ్యాయి వివరాలలోకి వెళితే కడప జిల్లా అవధూత కాశి నాయన మండలం లోని సావిశెట్టి పల్లి గ్రామంలో రైతులు సుమారు వెయ్యి ఎకరాలు అరటి తోటలు సాగు చేశారు గురువారం రాత్రి కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంట పూర్తిగా నేలమట్టమయ్యాయి దీంతో ఆ గ్రామంలోని రైతులు లబోదిబో అంటున్నారు కోతకు వచ్చిన ఈ దిశలో పంట పూర్తిగా నేలపాలు కావడం తో రైతుల బాధలు వర్ణనాతీతం చంద్ర ఓబుల రెడ్డి అనే ఓ రైతుకంగా 14 ఎకరాల లో అరటి పంటను సాగు చేసి సుమారు 20 లక్షల పైగా పెట్టుబడి పెట్టాడని ఇప్పుడు పంట పూర్తిగా నేలపాలు అయిందని ఆ రైతు గోడును వెళ్ళబోసుకున్నాడు రెండు రోజులు వర్షాలు రాకుండా ఉండి ఉంటే తను పెట్టిన పెట్టుబడిన వచ్చేదని ఇప్పుడు ఏమి చేయాలని అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికి రాక నేలపాలు కావడంతో ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అప్పు ఇచ్చినవారు తమ అప్పులు వడ్డీలతో సహా కట్టమని వెంటపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తీరా చూస్తే నోటికి వచ్చిన ఈ పంట నేడో రేపో కోతలు కోసి చేసిన అప్పులు తీర్చుకోవచ్చని ఆనందంగా ఉన్న ఆ రైతు రాత్రి కురిసిన ఆకాల వర్షాల కారణంగా పూర్తిగా నష్టపోయారు ఈ పంట నష్టపోయిన అటు ప్రభుత్వ అధికారులు ఇటు పాలకపక్ష నాయకులు స్పందించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు చేసిన అప్పులు తీర్చలేక చేతికి వచ్చిన పంటలు నేల పగలు కావడంతో మాకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## న్యాక్ లో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల, జమ్మలమడుగులో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సి) నిరుద్యోగ యువతి యువకులకు శిక్షణా కార్యక్రమములు ఏర్పాటు చేయడం జరుగుతుందని పులివెందుల సహాయ సంచాలకులు రాకేష్ ఒక ప్రకటనలో తెలియజే శారు. పులివెందులలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, జమ్మలమడుగులో డిజిటల్ మార్కె టింగ్ అసిస్టెంట్ కోర్సులపై రెండు నెలలు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు పదవ తరగతి ఆ పైన చదివిన,18 సం. నుండి 40 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. శిక్షణకు కావలసిన సామగ్రి ఉచితంగా అందించబడుతుంద న్నారు. అలాగే సుమారు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆ రంగాలలో ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తికర నిరుద్యోగ యువతీ యువకులు ఈనెల 14వ తేదీ లోపు పులివెందు ల,జమ్మలమడుగు న్యాక్ శిక్షణ కేంద్రాలను సంప్ర దించాలన్నారు. మరింత సమాచారం కొరకు 99851 42155 (పులివెందుల), 9912133531 (జమ్మలమడుగు) నెంబర్ల కు ఫోన్ చేసి సంప్రదించవచ్చున్నారు.

